మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | ఎడిటర్ : నంద కిషోర్ | సంపుటి : 08 | సంచిక : 101 | బుధవారం | 24 - 09 - 2025 | పేజీలు: 8 | వెల: 4


## జగన్ మీ వాదనలో నిజం ఉంటే సభకు రండి..



2లో..



# బీజేపీ నేతల భేటీ






మనగళం, కర్నూలు సిటీ : అనంతపురం జిల్లాలో మంగళవారం బీజేపీ నేతలు భేటీ అయ్యారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గోపి శ్రీనివాస్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు రాజేష్, బీజేపీ రాష్ట్ర సెక్రెటరీ సంది రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఏపీ ఎడుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల ఏపీ ఎడుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గా ఎన్నికైన బీజేపీ నేత నగరూరు రాఘవేంద్రకు బీజేపీ, ఓబీసీ మోర్చా నేతలు అభినందనలు తెలిపారు. ప్రస్తుత రాజకీయ అంశాలపై వారు చర్చించుకున్నారు.

# ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ మనందరి ఆకాంక్ష

- 2026 నాటికి ఏపీలో 5.37 కోట్ల మంది జనాభా ఉంటారని వెల్లడి
- ఆరోగ్యం కాపాడుకోవడం అతి ముఖ్యం
- అభివృద్ధి చెందిన దేశాల్లో జనాభా తగ్గుతోంది
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



మన గళం, అమరావతి : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ మనందరి ఆకాంక్ష అని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏపీ అసెంబ్లీలో ఇవాళ(మంగళవారం) వైద్యా, ఆరోగ్య శాఖ పై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. 2026 నాటికి ఏపీలో 5.37 కోట్ల మంది జనాభా ఉంటారని వెల్లడించారు. 2047 నాటికి భారత్ జనాభా 162 కోట్లు దాటుతుందని చెప్పుకొచ్చారు సీఎం చంద్రబాబు.

2047 నాటికి చైనా జనాభా 100 కోట్లే ఉంటుందని తెలిపారు. ఆరోగ్యం కాపాడుకోవడం అతి ముఖ్యమని సూచించారు. దక్షిణాదిలో జనాభా క్రమంగా తగ్గుతోందని చెప్పుకొచ్చారు. యూపీ, బిహార్ వల్లే జనాభా బ్యాలెన్స్ అవుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో జనాభా తగ్గుతోందని తెలిపారు. ఏపీలో పీహెచ్‌సీల సంఖ్య జాతీయ సగటు కంటే ఎక్కువ అని వివరించారు సీఎం చంద్రబాబు. డబ్ల్యూహెచ్‌వో ప్రకారం మెడికల్ ఆఫీసర్లు మనదగ్గరే ఎక్కువ అని చెప్పుకొచ్చారు. ఏపీలో ప్రస్తుతం 1.15 లక్షలమంది వైద్యులు ఉన్నారని వెల్లడించారు. భారతదేశంలో సగటు జీవితకాలం 70 ఏళ్లు అని వివరించారు. భారతదేశంలో 30గా ఉందని తెలిపారు. మనదేశంలో ఇమ్యూనైజేషన్ 97 శాతమని చెప్పుకొచ్చారు. ఏపీలో 98 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయని వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు 42 శాతమేనని వివరించారు సీఎం చంద్రబాబు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు 78 శాతం సాధించామని వెల్లడించారు. త్వరలో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులో 100 శాతం సాధిస్తామని ఉద్ఘాటించారు. గర్భిణుల్లో అనీమియా 32 శాతం ఉందని తెలిపారు. సిజేరియన్‌లో మనమే నెంబర్‌వన్.. ఇది సరికాదని చెప్పుకొచ్చారు. 90 శాతం సిజేరియన్లు ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.



### తిరుమల బ్రహ్మోత్సవాలకు

# సర్వం సిద్ధం

మన గళం, తిరుమల : కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తిరుమల క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ నెల 24 నుంచి అక్టోబరు 2 వరకు జరగనున్న ఈ వేడుకలకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈసారి సామాన్య భక్తులకే అత్యంత ప్రాధాన్యం ఇస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంది. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో అన్ని రకాల ప్రివిలేజ్ దర్శనాలను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. మాడ వీధుల్లో స్వామివారి వాహన సేవలను కనులారా వీక్షించేందుకు గంటల తరబడి వేచి ఉండే భక్తులకు ఈ ఏడాది ప్రత్యేకంగా 16 రకాల వంటకాలను అందించనున్నారు. రద్దీని నియంత్రించేందుకు, ప్రతి 45 నిమిషాలకు ఒకసారి సుమారు 35,000 మంది భక్తులను రీఫిల్లింగ్ పద్ధతిలో గ్యాలరీల్లోకి అనుమతించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. మాడ వీధుల

2 లో..



### అమెరికాలో హనుమాన్

# విగ్రహంపై వివాదం

అదొక 'నకిలీ దేవుడి విగ్రహం' అంటూ రిపబ్లికన్ నేత అలెగ్జాండర్ డంకన్ వ్యాఖ్య

మన గళం, ఇంటర్నెట్ డెస్క్: అమెరికాలోని టెక్సాస్‌లో ప్రతిష్ఠించిన 90 అడుగుల భారీ హనుమాన్ విగ్రహంపై ఓ రిపబ్లికన్ పార్టీ నేత చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. అమెరికా ఒక క్రైస్తవ దేశమని పేర్కొంటూ, ఇక్కడ హిందూ దేవుడి విగ్రహం ఏర్పాటు చేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ వ్యాఖ్యలపై హిందూ సంఘాలు,

2 లో..

### నాయకుల విగ్రహాల కోసం

# ప్రజల సొమ్ము వాడొద్దు



మన గళం, న్యూఢిల్లీ : తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానంలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మాజీ నేతల విగ్రహాల ఏర్పాటు కోసం ప్రజా ధనాన్ని వినియోగించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. "మీ మాజీ నాయకుల గొప్పతనాన్ని చాటుకోవడం

2 లో..

### ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు కేంద్ర

# కమిటీ సభ్యులు మృతి!



మన గళం, ఛత్తీస్‌గఢ్ : కేంద్రకమిటీ నాయకులు నేలకొరుగుతున్నారు. సాయుధ దళాలు చెల్లాచెదురవుతున్నాయి. దట్టమైన అడవుల్ని భద్రతాదళాలు జల్లెడ పడుతున్నాయి. వార్ వన్‌సైడ్ అన్నట్లుంది మావోయిస్టుల ఏరివేత. చూస్తుంటే డెడ్‌లైన్ కంటే ముందే ఆపరేషన్ కంప్లీట్ చేసేలా ఉంది కేంద్ర హెూంశాఖ. ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ తుపాకులు గర్జించాయి. నారాయణ్‌పూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో

2 లో..

### చీకటి జీవోలు తెచ్చే

# సంస్కృతి మాది కాదు

### - హెూంమంత్రి వంగలపూడి అనిత



మన గళం, అమరావతి : చీకటి జీవోలు తెచ్చే సంస్కృతి తమది కాదని ఏపీ హెూంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. రికార్డులు, లా ప్రకారం కేసుల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా 2019-24 కాలంలో తప్పుడు క్రిమినల్ కేసుల పరిష్కారంపై మండలిలో మంగళవారం నాడు

2 లో..

# మంత్రి లోకేశ్ హామీ

## - విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు



మన గళం, అమరావతి : విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణపై గత కొంతకాలంగా నెలకొన్న ఆందోళనలకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శాసనమండలి వేదికగా తెరదించారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించే ప్రణాళిక ఏదీ లేదని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కర్మాగారం పునరుద్ధరణ కోసం రూ.11, 440 కోట్ల భారీ ప్యాకేజీని ప్రకటించిందని గుర్తుచేశారు. ఈ ప్యాకేజీతో స్టీల్ ప్లాంట్ తిరిగి పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని, ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ

2 లో..

# 13 ఏళ్ల ఆఫ్ఘన్ బాలుడి సాహసం!



మన గళం, న్యూఢిల్లీ : ఒక ఊహకందని సాహసంతో 13 ఏళ్ల ఆఫ్ఘనిస్థాన్ బాలుడు అందరినీ దిగ్భ్రాంతికి గురిచేశాడు. విమానం టైర్లు ఉండే ల్యాండింగ్ గేర్ కంపార్ట్‌మెంట్‌లో దాక్కుని ఏకంగా కాబూల్ నుంచి ఢిల్లీకి ప్రయాణించాడు. రెండు గంటల పాటు అత్యంత ప్రమాదకరమైన స్థితిలో

2 లో..

## అమెరికాలో హనుమాన్ విగ్రహంపై వివాదం



నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వివరాల్లోకి వెళితే... టెక్సాస్‌లోని షుగర్ ల్యాండ్ నగరంలో ఉన్న శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో ఇటీవల 90 అడుగుల ఎత్తైన హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీనికి 'స్టాట్యూ ఆఫ్ యూనియన్' అని పేరు పెట్టారు. ఈ విగ్రహానికి సంబంధించిన వీడియోను టెక్సాస్ రిపబ్లికన్ నేత అలెగ్జాండర్ డంకన్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ చేస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. "టెక్సాస్‌లో ఒక నకిలీ హిందూ దేవుడి నకిలీ విగ్రహాన్ని మనం ఎందుకు అనుమతిస్తున్నాం? మనది ఒక క్రైస్తవ దేశం" అని ఆయన పేర్కొన్నారు. మరో పోస్టులో బైబిల్‌లోని వాక్యాలను ఉటంకిస్తూ, విగ్రహారాధనను వ్యతిరేకించారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో డంకన్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. హిందూ అమెరికన్ ఫౌండేషన్ (హెచ్ఏఎఫ్) ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. ఇవి హిందూ వ్యతిరేక, రెచ్చగొట్టే వ్యాఖ్యలని పేర్కొంది. ఈ విషయంపై టెక్సాస్ రిపబ్లికన్ పార్టీకి అధికారికంగా ఫిర్యాదు చేసింది. వివక్షకు వ్యతిరేకంగా పార్టీ నిబంధనలను ఉల్లంఘించిన డంకన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

మరోవైపు, చాలా మంది నెటిజన్లు కూడా డంకన్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరికీ మత స్వేచ్ఛ ఉంటుందని, ఏ మతాన్నైనా ఆచరించే హక్కు ఉందని గుర్తుచేశారు. ఒకరి నమ్మకాలను కించపరిచేలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. కాగా, 2024లో ఆవిష్కరించిన ఈ 'స్టాట్యూ ఆఫ్ యూనియన్' విగ్రహం, అమెరికాలోని అతిపెద్ద హిందూ కట్టడాలలో ఒకటిగా గుర్తింపు పొందింది. శ్రీ చిన్నజీయర్ స్వామి ఆలోచనలతో ఈ విగ్రహం రూపుదిద్దుకుంది.

## నాయకుల విగ్రహాల కోసం ప్రజల సొమ్ము వాడొద్దు



కోసం ప్రజల సొమ్మును ఎలా ఖర్చు చేస్తారు? దీనికి మేం అనుమతి ఇవ్వలేం" అని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే, తమిళనాడులోని తిరునెల్వేలి జిల్లా వల్లియూర్ కూరగాయల మార్కెట్ ప్రవేశ ద్వారం వద్ద దివంగత ముఖ్యమంత్రి కరుణానిధి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డీఎంకే ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం సుమారు రూ. 30 లక్షల వరకు ఖర్చు చేసి, కొన్ని నెలల క్రితమే పనులు కూడా ప్రారంభించింది. అయితే, ప్రభుత్వ స్థలంలో విగ్రహ ఏర్పాటును వ్యతిరేకిస్తూ కొందరు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, ప్రజా ప్రదేశాల్లో విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వకూడదని స్పష్టం చేసింది. కొన్నిసార్లు ఈ విగ్రహాల వల్ల ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తుతున్నాయని పేర్కొంటూ, విగ్రహ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని ఆదేశించింది. హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పును సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ధర్మాసనం, ప్రభుత్వ వైఖరిపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. మద్రాస్ హైకోర్టు తీర్పు సరైనదేనని సమర్థించింది. ప్రజాధనాన్ని ఇలాంటి పనుల కోసం దుర్వినియోగం చేయడాన్ని అనుమతించబోమని స్పష్టం చేసింది. వెంటనే పిటిషన్‌ను వెనక్కి తీసుకోవాలని, ఒకవేళ ఊరట కావాలనుకుంటే హైకోర్టునే ఆశ్రయించాలని ప్రభుత్వానికి సూచించింది.

## ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు మృతి!



మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు కేంద్రకమిటీ సభ్యులు హతమయ్యారు. కడారి సత్యనారా యణ రెడ్డి అలియాస్ కోసా, కట్టా రామచంద్రా రెడ్డి అలియాస్ వికల్ప్ ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టులకు మరో గట్టి దెబ్బ తగిలింది. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఎన్‌కౌంటర్ తర్వాత రెట్టించిన ఉత్సాహంతో భద్రతా బలగాలు కూంబింగ్ చేస్తున్నాయి. పక్కా సమాచారంతో మావోయిస్టులను రౌండప్ చేస్తున్నాయి. మావోయిస్టుల ఏరివేతపై సంచలన ట్వీట్ చేశారు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా. అగ్రనాయకులను ఏరివేశామని.. మిగతా వాళ్లని కూడా అంతం చేస్తామని ప్రకటించారు. 2026 మార్చి 31. దేశాన్ని మావోయిస్టు రహితంగా మార్చేందుకు కేంద్ర హోంశాఖ పెట్టుకున్న డెడ్‌లైన్ ఇది. కానీ ఈలోపే ఆ పని పూర్తిచేస్తాం అన్నట్లుంది భద్రతా బలగాల దూకుడు. ఆపరేషన్ కగార్‌తో పాటు ఇటీవల కర్రెగుట్టల్లో కూంబింగ్‌తో మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. చర్చలకు సిద్ధమని మావోయిస్టులు అంటున్నా.. అందుకు సిద్ధంగా లేమని సంకేతాలిస్తోంది కేంద్రం. అన్ని వైపులనుంచి దిగ్బంధించి మావోయిస్టులను సమూలంగా ఏరివేయాలన్న లక్ష్యంతో ఉంది. మావోయిస్టులతో చర్చించాలని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలతో పాటు, నక్సల్స్ సానుభూతిపరులు డిమాండ్ చేస్తున్నారు. కానీ కేంద్రం దానికి సిద్ధంగా లేదని అమిత్‌షా ట్వీట్‌తో తేలిపోయింది. చర్చల ప్రతిపాదనని కేంద్రం కనీసం పట్టించుకోవడం లేదంటున్నారు పౌరహక్కుల నేతలు. మావోయిస్టు కేంద్ర నాయకత్వంపై కేంద్ర బలగాలు గురిపెట్టాయి. వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు సెంట్రల్ కమిటీ దాదాపు ఖాళీ అయింది. ఆపరేషన్ కగార్ మొదలు పెట్టిన తర్వాత ఇప్పటిదాకా మావోయిస్టు కేంద్ర కమిటీలో 11 మంది కీలక నేతలు ప్రాణాలు కోల్పోయారు. దీంతో సెంట్రల్ కమిటీలో ఇప్పుడు మిగిలింది ఇక ఏడుగురే. అందుకే ఊపిరిపీల్చుకునే అవకాశం ఇవ్వకుండా ముప్పేటదాడి చేస్తున్నాయి భద్రతా బలగాలు.

## 13 ఏళ్ల ఆఫ్ఘన్ బాలుడి సాహసం!

ప్రయాణించి సురక్షితంగా కిందకు దిగడం అధికారులను సైతం ఆశ్చర్యపరిచింది. వివరాల్లోకి వెళితే... ఆఫ్ఘనిస్థాన్‌లోని కందూజ్ పట్టణానికి చెందిన ఈ బాలుడు, కాబూల్ విమానాశ్రయంలో భద్రతా సిబ్బంది కళ్లుగప్పి లోపలికి ప్రవేశించాడు. అక్కడి నుంచి ఢిల్లీ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న కేఏఎం ఎయిర్‌లైన్స్ విమానం వద్దకు చేరుకున్నాడు. ఎవరికీ అనుమానం రాకుండా విమానం టైర్ల మీదుగా ఎక్కి, ల్యాండింగ్ గేర్ కంపార్ట్‌మెంట్‌లో దాక్కున్నాడు. ఆదివారం ఉదయం 11 గంటలకు ఆ విమానం ఢిల్లీలో ల్యాండ్ అయిన తర్వాత, బాలుడు కిందకు దిగి ఎయిర్‌పోర్ట్ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా భద్రతా సిబ్బంది గమనించారు. అతడిని పట్టుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కేవలం సరదా కోసం, సాహసం చేయాలన్న ఆలోచనతోనే ఇలా చేశానని ఆ బాలుడు చెప్పడంతో అధికారులు అవాక్కయ్యారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బాలుడు దాక్కున్న ప్రదేశంలో ఎరుపు రంగులో ఉన్న ఒక చిన్న స్పీకర్ తప్ప మరేమీ లభించలేదు. ఎలాంటి విద్రోహ చర్యలకు అవకాశం లేదని నిర్ధారించుకున్న తర్వాతే ఆ విమానాన్ని తిరిగి ప్రయాణానికి అనుమతించారు. అనంతరం అదే రోజు రాత్రి ఆ బాలుడిని అదే విమానంలో తిరిగి కాబూల్‌కు పంపించేశారు. ఈ విషయాన్ని అధికారులు సోమవారం అధికారికంగా వెల్లడించారు.

## మంత్రి లోకేశ్ హామీ

విషయంలో చొరవ తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. నేడు శాసనమండలిలో రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడులపై జరిగిన స్వల్పకాలిక చర్చలో మంత్రి లోకేశ్ మాట్లాడారు. విశాఖ ఉక్కుపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చినప్పటికీ, ప్రతిపక్ష వైసీపీ ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారాలు చేస్తోందని ఆయన మండిపడ్డారు. వాస్తవాలను తెలుసుకోకుండా విమర్శలు చేయడం ప్రతిపక్షానికి అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి అనేక పెద్ద పరిశ్రమలను తీసుకువచ్చినట్లు లోకేశ్ గుర్తుచేశారు. ముఖ్యంగా, అనంతపురం జిల్లాకు కియా మోటార్స్ పరిశ్రమను తీసుకురావడం ద్వారా ఆ ప్రాంత రూపురేఖలే మారిపోయాయని తెలిపారు. "కియా రాకముందు అనంతపురం జిల్లాలో ప్రజల తలసరి ఆదాయం రూ.70 వేల కంటే తక్కువగా ఉండేది. ఆ పరిశ్రమ, దాని అనుబంధ యూనిట్ల రాకతో అక్కడి యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి, తలసరి ఆదాయం గణనీయంగా వృద్ధి చెందింది" అని ఆయన వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఇలాంటి పెట్టుబడులు ఎంతో కీలకమని పేర్కొన్నారు.

**- మండలిలో తీవ్ర వాగ్వాదం**

ఇదే చర్చ సందర్భంగా, మహిళల గౌరవం అనే అంశంపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రతిపక్ష నేతలు మహిళల గౌరవం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని లోకేశ్ విమర్శించారు. "నిండు సభలో నా తల్లిని దారుణంగా అవమానించినప్పుడు ఈ నేతలకు మహిళల గౌరవం గుర్తుకు రాలేదా? ఆ అవమానంతో ఆమె కోలుకోవడానికి రెండు నెలలు పట్టింది. ఆ బాధ ఏంటో నాకు తెలుసు. మా పార్టీ మహిళలపై అక్రమ కేసులు పెట్టినప్పుడు వీరు ఏం చేశారు? మహిళలను అవమానించే వైసీపీ నేతలకు వారి గౌరవం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు" అని లోకేశ్ తీవ్ర స్వరంతో అన్నారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి, ఉపాధి కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, విశాఖ ఉక్కు వంటి రాష్ట్ర ఆస్తులను కాపాడటంలో వెనకడుగు వేసేది లేదని ఆయన స్పష్టం చేశారు.

## తిరుమల బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం



బయట ఉన్న భక్తులు కూడా ఉత్సవాలను చూసేందుకు వీలుగా 36 భారీ ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేసినట్లు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భద్రతకు టీటీడీ పెద్దపీట వేసింది. 3,000 సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేయగా, 4,700 మంది పోలీసులు, 2,000 మంది టీటీడీ భద్రతా సిబ్బంది భక్తులకు రక్షణ కల్పించనున్నారు. భక్తుల సేవలో 3,500 మంది శ్రీవారి సేవకులు పాలుపంచుకోనున్నారు. కొండపైకి రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రతి 4 నిమిషాలకు ఒక బస్సును నడపనున్నారు. ఈసారి పారిశుద్ధ్య నిర్వహణ కోసం టీటీడీ సాంకేతికతను వినియోగిస్తోంది. సిబ్బంది పనితీరును పర్యవేక్షించేందుకు, భక్తుల నుంచి ఫీడ్‌బ్యాక్ స్వీకరించేందుకు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. భక్తులు ఎక్కడపడితే అక్కడ వదిలివేసే చెప్పుల సమస్యను అధిగమించేందుకు వినూత్నంగా క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానం ద్వారా సమస్య 90 శాతం పరిష్కారమైందని అధికారులు చెబుతున్నారు.

## చీకటి జీవోలు తెచ్చే సంస్కృతి మాది కాదు

ప్రశ్నోత్తరాలు జరిగాయి. ఈ సందర్భంగా జనసేన ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు అడిగిన ప్రశ్నలకు హోంమంత్రి అనిత ఈ మేరకు సమాధానమిచ్చారు. గత ప్రభుత్వం చాలామందిపై అక్రమ కేసులు పెట్టిందని తెలిపారు. అమరావతి రైతులు రాజధాని కోరుకుంటే వందలాది మందిపై కేసులు పెట్టారని పేర్కొన్నారు. తనపైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడితే కడప కోర్టుకు హాజరయ్యానని చెప్పారు. చీకటి జీవోలు తెచ్చే సంస్కృతి కూటమి ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. రికార్డులు, లా ప్రకారం కేసుల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు సహా అంగన్వాడీలు, ఆశావర్కర్లు తదితరులపై గత వైసీపీ ప్రభుత్వం పెట్టిన కేసులను త్వరగా పరిష్కరించేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వంగలపూడి అనిత తెలిపారు. పోలీసు, లా డిపార్ట్‌మెంట్‌తో సమన్వయం చేసుకుంటూ కేసుల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. సీపీఎస్ రద్దు కోరుతూ టీచర్లు చేసిన ఆందోళనలకు దిగితే 149 కేసులు పెట్టారని వంగలపూడి అనిత తెలిపారు. వాటిలో 80 శాతం కేసులను ఇప్పటికే ఎత్తివేశామని పేర్కొన్నారు. మిగిలిన కేసుల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

## జగన్ మీ వాదనలో నిజం ఉంటే సభకు రండి..



మన గళం, అమరావతి : ఆరోగ్యంపై ఏపీ అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ జరిగింది. ఏపీ వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ... తమకు వారసత్వంగా అనారోగ్య వ్యవస్థ వచ్చిందంటూ వ్యాఖ్యలు చేశారు. నియామకాల నుంచి ట్రాన్స్‌ఫర్ల వరకూ ప్రతి చోట పొలిటికల్ ఇన్ఫ్యూఎన్స్ కూడా ఉండేదన్నారు. జాతీయ హెల్త్ మిషన్ కింద 40 కార్యక్రమాలకు రూ.100 కోట్లు కేంద్రం ఇన్సెంటివ్‌లు వచ్చాయని తెలిపారు. డాక్టర్ల అటెండెన్స్ 8 శాతం పెరిగిందని వెల్లడించారు. క్యాన్సర్‌కు ముందస్తు పరీక్షలు నిర్వహించి వ్యాధినిర్ధారణ నిర్వహిస్తున్నామని సభలో మంత్రి తెలియజేశారు. మౌలిక సదుపాయాల కోసం గత ప్రభుత్వం ఏమీ చేయలేదని విమర్శించారు. కాంప్రహెన్సివ్ క్యాన్సర్ సెంటర్ కర్నూలు, కడప, విశాఖలో, గుంటూరులో ఏర్పాటు చేశామన్నారు. 30 పాయింట్స్ యాక్షన్ ప్లాన్ తీసుకొచ్చి ఎక్కడికక్కడ ఆడిట్ చేస్తున్నామన్నారు. యూనివర్సియల్ హెల్త్ కేర్ సెంటర్ ను తీసుకువస్తున్నామని చెప్పారు. బీపీఎల్, ఏపీఎల్ కుటుంబాలకు ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా వైద్యం అందిస్తున్నామని అన్నారు. అబద్దాలు చెప్పడమే అలవాటుగా మారిన పార్టీ వైసీపీ అంటూ సత్యకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

గొడ్డలి పోటును గుండెపోటుగా చిత్రీకరించిన వారు మెడికల్ కాలేజీలను అమ్మేస్తున్నారని అంటున్నారని ఫైర్ అయ్యారు. నాలుగు సంవత్సరాల్లో రూ.8,420 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా గత ప్రభుత్వం రూ.1550 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని వివరించారు. రూ.1550 కోట్లు నబార్డు, సెంట్రల్లీ స్పాన్సర్డ్ ఫండ్స్ దీనిలో ఉన్నాయన్నారు. సంవత్సరానికి రూ.387 కోట్లు ఖర్చు చేశారని.. ఇదే విధంగా జరిగితే 18 సంవత్సరాలు పడుతుందని తెలిపారు. ఐదు కాలేజీల్లో తరగతులు కూడా జరుగుతున్నాయని జగన్ అంటున్నారని.. మీ వాదనలో నిజం ఉంటే సభకు రావాలని... వచ్చి చర్చలో పాల్గొనాలని సవాల్ చేశారు. పార్వతీపురం భూమిని సేకరించకుండానే మెడికల్ కాలేజీ కట్టేశాం అంటున్నారని అన్నారు. పీపీపీ మోడ్ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేవని చెప్పారు. యాజమాన్య హక్కు తమ వద్దే ఉంటుందన్న వారు ఇచ్చేది కేవలం లీజు మాత్రమే అని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## గుండెపోటుతో ఆర్టీసీ బస్సులోనే కండక్టర్ మృతి

మన గళం, విశాఖపట్నం : విజయనగరం జిల్లా శృంగవరపుకోట ఆర్టీసీ డిపోనకు చెందిన కండక్టర్ ఈశ్వరరావు గుండెపోటుతో మరణించాడు. విధి నిర్వహణలో భాగంగా వైజాగ్ నుంచి తిరిగొస్తున్న సమయంలో మార్గమధ్యలోనే విపరీతమైన ఛాతీనొప్పితో పడిపోయాడు. బస్సును వెనక్కి తిప్పి ఆస్పత్రికి తీసుకెళ్లినప్పటికీ లాభం లేకుండా పోయింది. వివరాల్లోకి వెళ్తే.. ఈశ్వరరావు (51) విజయనగరం జిల్లా శృంగవరపుకోట ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం కొట్టాం-విశాఖ-కించుమండ మార్గంలో విధులకు హాజరయ్యాడు. అక్కడి నుంచి వైజాగ్‌కు తిరిగివస్తున్న సమయంలో మార్గమధ్యలోనే సరిపల్లి గ్రామం వద్దకు రాగానే ఛాతిలో నొప్పిగా అనిపించింది. ఇదే విషయాన్ని డ్రైవర్‌కు చెప్పాడు. వెంటనే స్పందించిన డ్రైవర్ నాయుడు.. బస్సును వెనక్కి తిప్పి పెందుర్తి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్లాడు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే ఈశ్వరరావు మరణించినట్లుగా నిర్ధారించారు. హాజరై వైజాగ్ నుంచి తిరిగివస్తుండగా.. మార్గమధ్యలోనే సరిపల్లి గ్రామం దగ్గరకు రాగానే గుండెల్లో నొప్పిగా ఉందంటూ డ్రైవర్ దృష్టికి తీసుకెళ్లాడు.

# అమ్మవారికి ప్రత్యేక పూజలు





మనగళం, కర్నూలు సిటీ : జయ గురుదత్త శ్రీ గురుదత్త గణపతి సచ్చిదానంద స్వామీజీ దివ్య ఆశీస్సులతో కర్నూలు శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో శరన్న వరాత్రులో భాగంగా మొదటిరోజు ప్రాతఃకాలంలో మహా గౌరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని బాల మహా త్రిపుర సుందరి దేవిగా అలంకరించి విశేష అర్చనలు నిర్వహించారు. అనంతరం మండ పారాధన, గణపతి పూజ, పుణ్యాహవా చనము, పంచగవ్య ప్రాశనం, సర్వతో భద్ర మండల ఆవాహన, కలశ స్థాపనం, నవ దుర్గ కలశ స్థాపనం, శ్రీదేవి, ఖడ్గమాల, లలిత సహ స్రనా మార్చనలు నిర్వహించారు. అనంతరం చండీ సప్తశతి పారాయణం చేశారు. సాయంకాలం ప్రదోష కాలర్చన,లలిత సహ స్రనామార్చన బాలా అష్టోత్తర పూజలు, ధనలక్ష్మి పూజలు జరిగినవి. విశేషంగా వక్కలతో అర్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధాన సేవకర్తలు డాక్టర్ వై కృష్ణమోహన్, డాక్టర్ వై నాగజ్యోతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# కార్మికులకు అన్యాయం చేయొద్దు



మనగళం, కర్నూలు సిటీ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను అక్రమంగా తొలగించి అన్యాయం చేస్తుందని సీఐటీయూ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ శామ్యూల్ పాల్ కు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఉపాధ్యక్షులు కే సుధాకరప్ప, జి ఏసు మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుండి కల్లూరు మండలం షరీఫ్ నగర్ జిల్లా పరిషత్ హై స్కూల్, లక్ష్మీపురం జిల్లా పరిషత్ హై స్కూల్లో ఎస్ జహారాభి, పీ రాజమ్మ మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మారినప్పుడల్లా రాజకీయ నాయకులు అధికారులపై ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చి మీరు దిగిపోవాలి వేరేవాళ్లు చేస్తారు అని అక్రమంగా తొలగించడం జరుగుతుందని ఇది అన్యాయమని తెలిపారు. తెలుగుదేశం నాయకులు తమ కార్యకర్తల ప్రేమ ఉంటే వారికి వేరే ఉపాధి చూపించాలని, పనిచేస్తున్న వారిని తీసి వేరే వారిని నియమించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇలాంటి అక్రమ తొలగింపులు ఆపకపోతే భవిష్యత్తులో కార్మికులను సమీకరించి ఉద్యమాలు చేయవలసి వస్తుందని వారు హెచ్చరించారు. స్పందించిన డీఈవో సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

# లోపాలు లేకుండా ఓటర్ల జాబితా పరిశీలించాలి

**– కర్నూలు నియోజకవర్గ ఆర్వో, కమిషనర్ పి.విశ్వనాథ్**



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2002 ఓటర్ల జాబితా డేటాను 2025 డేటాతో సరిపోల్చే టేబుల్ టాప్ వ్యాయామాన్ని లోపాలు లేకుండా పూర్తి చేయాలని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ సూచించారు. మంగళవారం స్థానిక ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో బీఎల్వోలకు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ %-% 2025 కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్పెషల్ సమ్మరీ రివిజన్ %-% 2025 కోసం ఎన్నికల సంఘం ఆంధ్రప్రదేశ్ 2002, 2025 ఓటర్ల జాబితాలను సమగ్రంగా పరిశీలించి డేటా మ్యాపింగ్ చేయాలని ఆదేశించిందని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఖచ్చితత్వం కోసం డూప్లికేట్ పేర్ల తొలగింపు, మరణాలు, చిరునామా మార్పులు వంటి అంశాలను సవరించి సమగ్ర జాబితా రూపొందించాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియను ఈ నెల 25లోపు పూర్తిచేసి, నెలాఖరుకు కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఫారం 6, 7, 8 సవరణల కోసం స్థానిక బీఎల్వోను సంప్రదించవచ్చని తెలిపారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్లు సుబ్బన్న, వాజిద్, ఆర్ఐలు రాజు, సుహైద్ తదితరులు పాల్గొన్నారు.

# మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం





మనగళం, కర్నూలు కార్పొరేషన్ : ప్రధాన మంత్రి ఆవాస్ యోజన %-% అర్బన్ 2.0 లో భాగంగా అంగీకార్ 2025 అవగాహన కార్యక్రమం కింద నగరపాలక కార్యాలయ ఆవరణలో మంగళవారం మెడికవర్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కమిషనర్ విశ్వనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే మరింత మెరుగ్గా పనిచేయగలుగుతారని, ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరని తెలిపారు. అంగీకార్ కార్యక్రమం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన %-% అర్బన్ 2.0లో ఒక ముఖ్య భాగమని, పేద, బలహీన వర్గాలకు గృహాల కల్పనతో పాటు సమగ్ర సంక్షేమం అందించడమే ప్రధాన లక్ష్యమని వివరించారు. ఇందులో భాగంగా పీఎంఏవై%-%యూ 2.0 దరఖాస్తుల వేగవంతమైన ధృవీకరణ, ప్రత్యేక వర్గాల లబ్ధిదారుల చేర్పు, గృహ రుణాలపై వడ్డీ సబ్సిడీ, పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన లాభాలు, గృహ ప్రవేశ కార్యక్రమాలు, తక్కువ ఆదాయ వర్గాల కోసం లోన్ మేళాలు, అవగాహన కార్యక్రమాలు వంటి అనేక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. నగరంలో ఇళ్ళు లేనివారు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ కోరారు. మధ్యతరగతి వారు ఇళ్ళ కోసం సబ్సిడి రుణాలు పొందాలని కోరారు. ఆరోగ్య శిబిరంలో ఉద్యోగులకు ఉచిత వైద్య పరీక్షలు, రక్తపోటు, మధుమేహం, హృదయ సంబంధిత పరీక్షలు, అలాగే సాధారణ ఆరోగ్య సలహాలను వైద్యులు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, సోషల్ డెవలప్మెంట్ స్పెషలిస్ట్ డా.పెంచలయ్య, ఎంఐయస్ మధుసూదన్ రెడ్డి, మెడికవర్ ఆసుపత్రి వైద్యులు మురళీ మోహన్, మంజూనాథ్, మహేశ్వర్ రెడ్డి, బి.వి. కొండారెడ్డి, శేషనాయుడు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బన్నీ ఉత్సవం ఏర్పాట్లపై ఎస్పీతో చర్చించిన ఎంపీ నాగరాజు



మనగళం, కర్నూలు క్రైం : అక్టోబర్ రెండవ తేదీన దేవరగట్టులో జరిగే మాలమల్లేశ్వర స్వామి బన్నీ ఉత్సవంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ను కోరారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎంపీ ఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా దేవరగట్టు బన్నీ ఉత్సవం ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ భక్తులు బన్నీ ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు.

# చిన్నపిల్లల సంరక్షణ సంస్థల పర్యవేక్షణ తరచూ జరగాలి

**– జిల్లా జాయింట్ కలెక్టర్, కమిటీ చైర్మన్ డాక్టర్ బి. నవ్య**




మనగళం, కర్నూలు సిటీ : జిల్లాలో ఉన్న 11 చిన్న పిల్లల సంరక్షణ సంస్థల పర్యవేక్షణ నిరంతరం జరగాలని జాయింట్ కలెక్టర్ మరియు కమిటీ చైర్మన్ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం మిషన్ వాత్సల్య స్కీం లో భాగంగా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేసిన చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూట్ డిస్ట్రిక్ట్ లెవెల్ ఇన్స్పెక్టింగ్ కమిటీ మొట్టమొదటి సమావేశం జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 11 చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ ఉన్నాయని, ఇందులో 4 రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో, 7 ప్రైవేటు సంస్థలు నిర్వహించబడుతున్నాయని చెప్పారు. ఈ చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్ లో పిల్లల కు అందిస్తున్నటువంటి వసతులు, రక్షణ చర్యలు, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ చర్యలు, చదువు, బట్టలు తదితర విషయాలను పరిశీలించాలని కమిటీకి సూచించారు. జిల్లాలోని 11 చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్ లో 6 చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్ ను డిస్ట్రిక్ట్ లెవెల్ అప్రూవల్ కమిటీ అప్రూవ్ చేసిందని, మిగిలిన 5సీసీఐ ( చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్ ) ను తొందరగా ఇన్స్పెక్షన్ చేయాలని ఆదేశించారు. సీసీఐ ఇన్స్పెక్షన్ లో చైర్మన్ హోదాలో నేను కూడా పాల్గొంటానని జాయింట్ కలెక్టర్ తెలియజేశారు. అనంతరం స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి పి.విజయ మాట్లాడారు. డిస్ట్రిక్ట్ లెవెల్ ఇన్ స్పెక్షన్ కమిటీ సభ్యుల రోల్స్ అండ్ రెస్పాన్సిబిలిటీస్ గురించి వివరిస్తూ ఫార్మ్-46 ఏ విధంగా చేయాలో వివరించారు. సమావేశంలో కమిటీ మెంబెర్ సెక్రటరీ టి.శారద ( జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్), కమిటీ సభ్యులు డాక్టర్.ఎం.మంజుష, మెడికల్ ఆఫీసర్, ఎస్.మహబూబ్ బాషా ( సోషల్ వర్కర్, బర్డ్స్ ఆర్గనైజేషన్), డాక్టర్.డి.గంగాధర్ నాయక్, సైక్రాయాటిస్ట్, రాయపాటి శ్రీనివాసులు-సోషల్ యక్టివిస్ట్ తదితరులు పాల్గొన్నారు.

# సేవింగ్స్ ఖాతా ఉంటే చాలు.. రోజుకు రూ.1,50,000.. 6.5 శాతం వడ్డీ

మనగళం, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ సహా దాదాపు అన్ని బ్యాంకుల్లో పొదుపు ఖాతాలపై వడ్డీ రేటు 3 శాతం లోపే ఉంటుంది. కొన్ని బ్యాంకులు మాత్రమే అధిక డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ ఇస్తాయి. అయితే, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ అనుబంధ సంస్థ జియో పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ బంపర్ ఆఫర్ ఇచ్చింది. సేవింగ్స్ ప్రో అకౌంట్ లాంచ్ చేసినట్లు ప్రకటించింది. ఈ బ్యాంకు ఖాతాలో ఉండే అదనపు డబ్బులపై ఎక్స్‌ట్రా రిటర్న్ ఆఫర్ చేస్తున్నట్లు తెలిపింది. సేవింగ్స్ ప్రో అనేది ఆటో స్వీప్ అకౌంట్. అకౌంట్లో ఉండే అదనపు ఫండ్స్‌ని ఓవర్‌నైట్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసి గరిష్ఠ వడ్డీ ఆదాయం అందిస్తామని తెలిపింది. జియో పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ సేవింగ్స్ ప్రో అకౌంట్ ద్వారా ఆటోమేటిక్‌గా అదనపు డబ్బులను ఓవర్ నైట్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసి 6.50 శాతం వరకు రిటర్న్ అందించే ప్రయత్నం చేస్తుంది. గ్రోత్ ప్లాన్స్‌లోని 2 ఏళ్ల వార్షిక లాభాల ఆధారంగా ఈ రిటర్న్ ఉంటాయని తెలిపింది. సేవింగ్స్ ప్రో అనేది ఒక ఆటో స్వీప్ సేవింగ్స్ అకౌంట్. ఈ ఖాతా తీసుకున్నవారు థ్రెషోల్డ్ అమౌంట్ ఎంపిక చేసుకోవాలి. కనీసం రూ.5000గా ఎంచుకోవాల్సి ఉంటుంది. అంటే ఈ రూ.5 వేలకు మించి అమౌంట్ ఖాతాలో ఉన్నప్పుడు ఆ డబ్బులను తక్కువ రిస్క్ ఉండే ఓవర్‌నైట్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఆటమేటిక్‌గా ఇన్వెస్ట్ చేస్తారు. ఈ సౌకర్యం ద్వారా రోజుకు గరిష్ఠంగా రూ.1,50,000 వరకు పెట్టుబడి పెట్టే అవకాశం కల్పిస్తున్నట్లు జియో పేమెంట్స్ బ్యాంక్ తెలిపింది. సెక్యూరిటీస్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా సెబీ నిబంధనల ప్రకారం రిడంప్షన్ ఆప్షన్స్ ఉంటాయి. కస్టమర్లు తక్షణే 90 శాతం వరకు ఫండ్స్ తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. గరిష్ఠంగా రూ.50 వేల వరకు తీసుకోవచ్చు. అంతకు మించితే 1 టూ 2 వర్కింగ్ డేస్‌లో ప్రాసెసింగ్ అవుతుంది. ఈ స్కీమ్‌లో ఎలాంటి హిడెన్ ఛార్జీలు, ఎంట్రీ, ఎగ్జిట్ లోడ్స్, లాకిన్ పీరియడ్స్ ఉండవు.

# అర్జీదారునికి అర్థమయ్యేలా ఎండార్స్మెంట్ ఇవ్వాలి



– జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్

మనగళం, ఉయ్యాలవాడ: నంద్యాల జిల్లా, ఉయ్యాలవాడ తహల్దార్ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత నిస్తోందన్నారు. పి జి ఆర్ ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని వీఆర్వోలకు సూచించారు. అర్జీ దారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వారికి అర్థమయ్యే విధంగా ఎండార్స్మెంటు క్లియర్ గా ఇవ్వాలన్నారు. ఉయ్యాలవాడ మండలంలో ఎక్కువగా భూ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయని, పరిష్కారానికి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి .విష్ణు చరణ్ పిజిఆర్ఎస్ అర్జీలను ఎలా క్లియర్ చేయాలి, అర్జీదారునికి ఎండార్స్మెంట్ ఎలా ఇవ్వాలి తదితర వివరాలను వీఆర్వోలకు సూచించారు.

## ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శిగా బి.వెంకటేశ్వరమ్మ ఎన్నిక పట్ల నాయకుల హర్షం




మన గళండోన్ నంద్యాల ఎన్జీవోస్ కాలనీ లోని నేషనల్ పీజీ కళాశాలలో సోమవారం జరిగిన ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా 2వ మహాసభలో ప్రతినిధులు జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అందులో జిల్లా సహాయ కార్యదర్శిగా డోన్ నుండి బి. వెంకటేశ్వరమ్మ ఎన్ని కయ్యారు. ఆమె ఎన్నిక పట్ల సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.శివరాం, సీనియర్ నాయకులు జి.కొండయ్య, పి.రామాంజనేయులు, సిఐటియు పట్టణ అధ్యక్షులు నక్కీ శ్రీకాంత్, మండల కన్వీనర్ ఎ.వి.భాస్కర్ రెడ్డి,కో కన్వీనర్ బి.నాగమద్దయ్య, ప్యాపిలి మండల కార్యదర్శి ఎస్.ఎ.చిన్న రెహమాన్ తదితరులు వర్షం వ్యక్తం చేశారు.

## 60 వేలకే బైక్స్, 70 కిమీ మైలేజ్...

మనగళం, కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు చేసిన నేపథ్యంలో కొత్త వాహనాలు కొనుగోలు చేసే వారికి అదిరిపోయే శుభవార్త అనేది. ముఖ్యంగా లక్ష రూపాయల లోపు... బైక్స్ కొనుగోలు చేసే వారికి మంచి అవకాశం దక్కింది. హీరో అలాగే హెూండా... కంపెనీలకు సంబంధించిన బైక్ ల ధరలు భారీగా తగ్గాయి. ఒక్కో బైక్ పై ఐదు నుంచి 6000 రూపాయలు తగ్గిపోయాయి. గతంలో 28 శాతం జీఎస్టీ ఉండగా.. ఇప్పుడు ఆ జీఎస్టీ 18 శాతానికి తగ్గించింది కేంద్రం. గతంలో హీరో స్పెండర్ ప్లస్ 80,166 రూపాయలు ఉండగా ఇప్పుడు దాని ధర రూ. 73,664 కు తగ్గింది. ఇది ఎక్స్ షోరూం ధర ప్రకారమే. అంటే ఓవరాల్ గా ఈ బైక్ పైన 6400 రూపాయలు తగ్గిందని చెప్పవచ్చు. అలాగే బడ్జెట్లో కొనుగోలు చేసే బైక్స్ లో హీరో హెచ్ఎఫ్ డీలక్స్ ఒకటి. ఈ బైక్ ధర... ఇప్పుడు 60 వేల 738 రూపాయలకు తగ్గింది.

# ఎనర్జీ ప్రాజెక్ట్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి





మనగళం, ఒర్వకల్లు : ఓర్వకల్లు మండలం గుమ్మితం తాండా వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ ను మంగళవారం జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సందర్శించారు. గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ సైట్ లోని అప్పర్ రిజర్వాయర్, అప్పర్ ఇన్ టేక్ పాయింట్, ప్రాజెక్ట్ సైట్,పవర్ హౌస్ తదితర ప్రాంతాలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ పనితీరు, రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పత్తి గురించి జిల్లా కలెక్టర్ కంపెనీ యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రీన్ కో ప్రాజెక్ట్ పిడి శ్రీనివాసరావు, ఏపీడీ శ్రీనివాస్ నాయుడు, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఓర్వకల్లు తహసీల్దార్ విద్యా సాగర్, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటలను పరిశీలించిన కలెక్టర్



మనగళం, బేతంచర్ల/నంద్యాల: బేతంచెర్ల మండలంలోని ఎంబాయి, సీతారామపురం గ్రామాలను మంగళవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి సందర్శించారు. ఉద్యాన పంటలను ప్రత్యక్షంగా పరిశీంచారు. ఈ సందర్భంగా ఉల్లి వ్యాపారులు, రైతులతో ముఖాముఖి జరిపి పంటల దిగుబడి, ఆదాయం, లాభనష్టాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా లభించే నాటు రకాలకే పరిమితం కాకుండా అధిక దిగుబడి ఇచ్చే వినూత్న రకాలను సాగు చేయాలని, నాణ్యమైన విత్తనాలను వాడుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతులు ఉల్లిపంటకు ప్రస్తుతం క్వింటాల్ ధర రూ.650 నుండి రూ.700 మాత్రమే ఉన్నందున గిట్టుబాటు ధర లభించడం లేదని కలెక్టర్‌కు నివేదించారు. రైతు ప్రభాకర్ రెడ్డి మల్చింగ్ పద్ధతిలో సాగుచేసిన దానిమ్మ పంటను కలెక్టర్ పరిశీలించారు. ఈ విధానం వల్ల రసాయనాలు, చీడపీడల బెడద తగ్గుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. అధిక ఆదాయం ఇచ్చే పంటల వైపు దృష్టి సారించాలని, ఉద్యాన శాఖ అధికారుల సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. ఎంబాయి గ్రామంలో అరటి, మామిడి పంటలు అధికంగా సాగుతున్నాయని రైతులు వివరించగా, మామిడి పంట ఉమ్మడి కర్నూలు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిందని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు ఫ్రూట్ కేర్ యాక్టివిటీ కింద మామిడి, దానిమ్మలకు సదుపాయాలు కల్పించాలని కోరగా, ఈ సంవత్సరం నుంచే అమలు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అదే గ్రామంలో రైతు మహబూబ్ బాషా 40 సెంట్లలో ట్రెల్లిసింగ్ పద్ధతిలో సాగుచేసిన టమోటా పంటను కలెక్టర్ పరిశీలించారు. గత సంవత్సరం నాలుగు కోతల ద్వారా దిగుబడి సాధించి అధిక లాభాలు పొందినట్లు, ఈ ఏడాది కూడా మంచి దిగుబడి వచ్చిందని రైతు వివరించారు. అనంతరం సీతారామపురం గ్రామంలో పాలెం యుగంధర్ రెడ్డి వేసిన షేడ్ నెట్ నర్సరీని సందర్శించిన కలెక్టర్ అరటి, మిరప, చామంతి టిష్యూ కల్చర్ మొక్కలను పరిశీలించారు. ఈ నర్సరీ ద్వారా చుట్టుపక్కల ప్రాంతాలకు నార్లు సరఫరా చేసి అధిక లాభాలు పొందుతున్నట్టు రైతు వివరించారు. ప్రభుత్వం సబ్సిడీతో అందించిన ఈ సదుపాయాన్ని ఉపయోగించి మంచి ఆదాయం పొందుతున్నానని కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తరువాత ఉద్యాన, పూల సాగు రైతులతో కలెక్టర్ ముఖాముఖి జరిపి వివరాలు తెలుసుకున్నారు. సీతారామపురం గ్రామంలో సుమారు 900 ఎకరాల్లో పూల సాగుతో పాటు అరటి, బత్తాయి, చామంతి, ఉల్లి, టమోటా పంటలను సాగు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. ఈ ప్రాంతం ఉద్యాన పంటలకు అనుకూలమని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. రైతు భూపాల్ రెడ్డి నాలుగు ఎకరాల్లో సాగుచేసిన అంజూరు పంటను కలెక్టర్ పరిశీలించారు. నూతనంగా సాగు చేస్తున్న "దయానా" రకం ద్వారా రూ.10 లక్షల ఆదాయం పొందుతున్నానని రైతు వివరించారు. ఈ రకం ఎండు అంజూరుకు అనుకూలమని, ఇందుకోసం ఏర్పాటు చేసిన డ్రై యూనిట్‌ను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్యాక్ హౌస్‌ను సందర్శించారు. అనంతరం రైతు రామేశ్వర్ రెడ్డి వేసిన చామంతి పంటను పరిశీలించారు. సెంటెడ్ ఎల్లో, పేపర్ ఎల్లో, బుల్లెట్ రకాలను సాగు చేస్తున్న రైతును అభినందించారు. పూల సాగు ద్వారా లాభాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎప్పటికప్పుడు సాంకేతిక సలహాలు ఇవ్వడంతో పాటు, అవగాహన కార్యక్రమాలు అందించాలని ఉద్యాన శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అధిక దిగుబడి ఇచ్చే పంటల ఉత్పత్తిని ప్రోత్సహించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా కలెక్టర్ వివరించారు.

## భక్తులకు వసతులు కల్పించాలి

మనగళం, బేతంచర్ల: బేతంచెర్ల మండలంలోని ప్రసిద్ధ మద్దిలేటి రంగస్వామి దేవాలయాన్ని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం సందర్శించారు. భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వచ్చిన అభిప్రాయాల నేపథ్యంలో కలెక్టర్ దేవస్థానం ఈఓ రామాంజనేయులు నుండి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వసతి గదులు, తాగునీటి సదుపాయం, పార్కింగ్ ప్రదేశాలు, పారిశుద్ధ్య నిర్వహణ, క్యూ లైన్ దర్శనాలు, ప్రసాదాల పంపిణీ వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ప్రతి విభాగంలోనూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఈఓను కలెక్టర్ ఆదేశించారు. దేవాలయం పరిధిలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 40 టాయిలెట్లు, సహాయక కేంద్రం, పబ్లిక్ టాయిలెట్లు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి మౌలిక వసతులను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం పనులు వేగంగా పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు. పొలం రస్తా వివాదంపై కలెక్టర్ విచారణ : బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన రైతు మధు శేఖర్ గౌడ్‌కు సంబంధించిన పొలం రస్తా వివాదంపై కూడా కలెక్టర్ విచారణ జరిపారు. సర్వే నెంబర్ 961/బి2లో ఉన్న 7.62 ఎకరాల పొలం వెనుక భాగంలో ఉన్న మరో పొలానికి వెళ్లేందుకు రస్తా సమస్య తలెత్తడంతో ఇరు వర్గాల మధ్య వివాదం నెలకొంది. ఈ అంశంపై కలెక్టర్ ఇరుపక్షాలకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత సమస్యను 15 రోజుల్లోపు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఇందుకు సంబంధించి డోన్ ఆర్డీఓ నరసింహులు, బేతంచెర్ల తహసీల్దార్ నాగమణిలు ఇరుపక్షాల నుండి నివేదికలు సేకరించి సమర్పించాల్సిందిగా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

## నీటి సరఫరా పైప్ లైన్ నిర్మాణం పూర్తి చేయాలి



– జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

మనగళం, ఓర్వకల్లు : ముచ్చుమర్రి నుండి ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్ కు నీటి సరఫరా పైప్ లైన్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఓర్వకలు మండలం గుట్టపాడు గ్రామ సమీపంలో ఉన్న జైరాజ్ ఇస్పాత్ స్టీల్ ప్లాంట్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్లాంట్ వివరాలను యాజమాన్యం, అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఎంతమందికి ఉపాధి అవకాశాలు కల్పించారని జై రాజ్ ఇస్పత్ యాజమాన్యంతో కలెక్టర్ ఆరా తీశారు. సిఎస్సార్ నిధుల కింద నంద్యాల చెక్ పోస్ట్ వద్ద నిర్మిస్తున్న స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర ఉద్యానవనం పార్కును అభివృద్ధి చేయాలని కలెక్టర్ జైరాజ్ ఇస్పాత్ కంపెనీ యాజమాన్యాన్ని ఆదేశించారు. ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్ మేళా లో భాగస్వాములు కావాలని, ఈ అంశంపై జిల్లా ఉపాధి కల్పన అధికారితో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జైరాజ్ ఇస్పాత్ లిమిటెడ్ లో జరుగుతున్న స్టీల్ ఉత్పత్తిని కలెక్టర్ పరిశీలించారు. అంతకు ముందు ఓర్వకల్లు మండలం ఉప్పలపాడు వద్ద డ్రోన్ హబ్ కు కేటాయించిన భూమిని కలెక్టర్ పరిశీలించారు.

## సున్నిపెంట లో విధి లైట్స్ సమస్యకు చెక్ పెట్టిన కూటమి ప్రభుత్వం



మనగలం : గౌరవ శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు మండల ఇంచార్జ్ యుగంధర్ రెడ్డి గారి సహకారంతో ఈరోజు 23 వ తారీకు అంధకారం లో ఉన్నా సున్నిపెంట లో రాత్రి పూట రోడ్లు పై ప్రజలు తిరగాలంటే వీధిలైట్లు లేక చీకటి లో బయట తిరగాలి అంటే భయభ్రాంతులకు గురవుతున్న సమయంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజల సమస్య ని తెలుసుకొని ఎక్కడ సమస్య ఉన్నా చాలా ఫాస్ట్ గా స్పందించి, సమస్య లేకుండా చేస్తున్నారు,, స్థానిక సున్నిపెంట లో అంబేద్కర్ బొమ్మ నుంచి వెస్టన్ కాలనీ వైపు వెళ్లాలంటే చాలా చీకటి ఉండేది రోడ్ పైన పాములు పురుగులు ఎక్కడ ఉంటాయని భయంతో , పెద్దవాళ్ళు, చిన్న పిల్లలు, కాలనీ వాళ్లు తిరగాలంటే భయపడుతూ ఉండేవాళ్ళు నవరాత్రి సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి గుడి కి చీకటి లో భక్తులు వెళ్తున్నారు ఈ సమస్యని 22వ బూతు కన్వీనర్ కి చెప్పగా విధి లైట్స్ వెంటనే లైట్స్ తెప్పిచి వేయడం జరిగింది ,, వెంటనే స్పందించిన 22వ బూత్ కన్వినర్ మహమ్మద్ హుస్సేన్ గారికీ మరియు కూటమి ప్రభుత్వానికి కాలనీ ప్రజలు, మరియు గుడికి వెళ్లే భక్తులు ధన్యవాదములు తెలిపారు

## బంగారం ధరలు రాకెట్ వేగంతో పెరుగుతూనే ఉన్నాయి..

మనగళం, పేరగడం రానీ తగ్గడం లేని బంగారం ధరలుఇటీవల బంగారం ధరలు రాకెట్ వేగంతో పెరుగుతుండటం అనేది ఆర్థిక ప్రపంచంలో కొత్త ట్రెండ్‌గా మారింది. రోజురోజుకూ ఈధాతువు ధరలు ఆల్ టైమ్ హై రికార్డులను సాధిస్తూ కట్టుదిట్టంగా ఎదుగుతున్నాయి. గత కొన్ని నెలల్లోనూ తగ్గింపు కనిపించడం లేదు, దీనివల్ల మార్కెట్‌లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి.ఇన్వెస్టర్లకు బంగారం బాగానే లాభదాయకంబంగారంపై పెట్టుబడులు పెట్టిన వారికి ఈ వృద్ధి మంచి లాభాలను ఇచ్చింది. ఈ సంవత్సరం బంగారం ధరల వృద్ధి 40% కంటే ఎక్కువగా నమోదైంది. ఈ భారీ రాబడి కారణంగా, ఇన్వెస్టర్లు మరింత ఆశతో ఈ మార్కెట్‌లో కొనసాగుతున్నారు. నిపుణుల అభిపాయం: బంగారం ధరల భవిష్యత్తు అర్థవ్యవస్థ నిపుణులు, ఆర్థిక విశ్లేషకులు ఈ రకమైన వేగవంతమైన వృద్ధి కొనసాగుతుంది అని అంచనా వేస్తున్నారు. వారు చెప్పేది ప్రకారం, ఈ ధాతువు ధరలు వచ్చే ఐదు సంవత్సరాల్లో మరింత పెరిగి 10 గ్రాములకు రూ. 2 లక్షలకుపైగా చేరవచ్చు. బంగారం పెట్టుబడులు భవిష్యత్‌లో కూడా విశ్వసనీయ మార్గం ఈ ధాతువు విలువ నిరంతరం పెరుగుతుండటం, ఆర్థిక అస్థిరతల సమయంలో కూడా స్థిరమైన సంపదగా నిలబడటం వలన, బంగారంపై పెట్టుబడులు పెట్టడం ఇప్పటికీ మంచి ఆలోచనగా ఉంది. భవిష్యత్తులో కూడా బంగారం పెట్టుబడులు సంపద వృద్ధికి మద్దతుగా ఉంటాయని నిపుణులు విశ్వసిస్తున్నారు.

# సంపాదకీయం

ఎన్నికల కమిషన్ ఏం చేస్తోంది?

లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ లేవనెత్తిన ఓట్‌చోరీ నినాదం దేశవ్యాప్తంగా ఎంత చర్చగా మారిందనేది తెలిసిందే. తాజాగా మరోసారి ఆయన ఎన్నికల కమిషన్‌పై విమర్శలు గుప్పించారు. అయినప్పటికీ ఈసీ నుంచి సమాధానం రాలేదు.అసలు ఎన్నికల కమిషన్ ఏం చేస్తోంది? దీనిపై ఎవరూ ఏమీ మాట్లాకపోవడంతో, ఇది ప్రజలకేమీ సంబంధంలేని వ్యవహారంగా రాజకీయరంగు పులుముకొంటోంది. దొంగ ఓట్ల చేరిక మొదలు కొందరి ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగించేస్తున్నారని రాహుల్ చెబుతుంటే దీనికి పూర్తి వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఈసీకి ఉందా,లేదా?ఈ వ్యవహారంపై నిజం ఏమిటన్నది రాహుల్‌గాంధీ ప్రశ్నలకు కాకపోయినా దేశ ప్రజానికానికైనా జవాబు చెప్పాలి.ఎందుకంటే, ప్రభుత్వాలను ప్రజలు తమ ఓటు ద్వారా ఎన్నుకొనేలా ఎన్నికలు నిర్వహించేది ఈసీ. అలాంటి ఎన్నికలపై అనేక అనుమానాలు వస్తుంటే వాటికి ఈసీ వివరణ ఎంతో అవసరం. అదిచ్చే క్లారిటీతోనే తమ ఓటుతోనే ఎన్నికైన ప్రభుత్వం వచ్చిందన్న భరోసా ప్రజల్లో పెరుగుతుంది. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికి కొన్ని అనేకమార్లు వివిధ రాష్ట్రాల్లో ఈసీ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించింది. కేంద్రంలో ప్రభుత్వం కోసం ఎన్నికలు జరుగుతూ వస్తున్నాయి. ఇన్నిసార్లు ఎన్నికలు జరిగినా ఈసీ మీద ఈస్థాయిలో ఎవరూ ఆరోపణలు ఎప్పుడూ రాలేదు. ఇప్పుడ రాహుల్‌గాంధీ వేస్తున్న ప్రశ్నలు ఈసీ మూలాలనే ప్రశ్నిస్తున్నాయి, కమిషన్ ఉనికినే సవాల్ చేసేలా ఉన్నాయి. అయినా ఈసీ అంతపెద్దగా రియాక్ట్ కావడం లేదన్న చర్చ అయితే అంతటా నడుస్తోంది. ఈసీ అంటే సర్వ స్వతంత్ర సంస్థ. అంతేకాదు రాజ్యాంగబద్ధమైనది కూడా. అలాంటి సంస్థ మీద ప్రతిపక్షనేత ఇంత సీరియెస్ విమర్శలు చేస్తూ ఆధారాలతో సహా వెల్లడిస్తుంటే జవాబు చెపాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌కు లేదా అన్నదే ఇక్కడ ప్రశ్న. తీవ్రమైన చర్చ జరిగాక ఆగస్టు పదిహేడున ఒకసారి ఈసీ ప్రెస్‌మీట్ పెట్టి "రాహుల్ గాంధీ చేసిన విమర్శలు తప్పు. ఆయన దగ్గర ఆధారాలుంటే అఫిడవిట్ రూపంలో ఇవ్వాలి. లేదంటే క్షమాపణలు చెప్పాలి" అని ఎన్నికల ప్రధానాధికారి అన్నారు. ఆ తర్వాత ఈసీ తరఫున మళ్లీ ఎవరూ ప్రెస్ ముందుకు రాలేదు. ఇక దీనిపై ట్వీట్లతోనే ఖండిస్తున్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల తరఫున ప్రశ్నించే హక్కు విపక్షాలకు ఉంటుంది. ఓట్‌చోరీ వ్యవహారంపై ఇప్పుడు రాహుల్‌గాంధీ సంధించే ప్రశ్నలు కూడా అదే కోణంలో చూడాలి. కానీ బీజేపీ అలా చూడకపోవడం బాధాకరం. ప్రజల్ని తప్పుతోవ పట్టించేందుకు రాహుల్ ప్రయత్నిస్తున్నాడని, ఆయనకు రాజ్యాంగం మీద గౌరవం లేదని, చెప్పే మాటలు అర్థం లేనివని ఏవేవో వ్యాఖ్యానిస్తున్నది. ఎక్కడెక్కడ ఓట్లు చోరికి గురయ్యాయో, ఎక్కడ తొలగించారో సాక్ష్యాలతో సహా వివరిస్తుంటే కల్లబొల్లి కబుర్లతో కాలయాపన చేస్తున్న బీజేపీని మాటలనే ప్రజలు విశ్వసించడం లేదని ఆ పార్టీ నాయకులు గ్రహించడం లేదు. ఓట్ చోరీ జరగలేదని బీజేపీ రుజువు చేయచ్చు కదా? దీనిపై ఎలా ముందుకెళ్లినా తమకే నష్టమన్న రీతిలో ఆ పార్టీ ఆలోచిస్తోందని అర్థమవుతోంది. పైగా బీహార్ ఎన్నికలు దగ్గర పడిన తరుణంలో దీన్నుంచి ఎలాగైనా గట్టెక్కాలనే ఆందోళనలో ఉంది. ఇలాంటి సందర్భంలో ఈసీ ఎందుకు మాట్లాడం లేదు? దీన్నిబట్టి చూస్తే రాహుల్ ఆరోపించినట్టుగా బీజేపీ– ఈసీ బంధం బాగా ధృఢంగా సాగుతోందన్నట్టే కదా. లేదంటే ఆరోపణలన్నింటికి సమాధానం చెప్పాలి. రాహుల్ చేసిన ఆరోపణలను సుమోటోగా స్వీకరించాలి, విచారణ చేపట్టాలి.ఆయన చేసిన ఆరోపణలు తప్పయితే చర్యలు తీసకునే అధికారం ఈసీకి ఉంది. మరి అలాంటప్పుడు జంకడం దేనికి? ఈసి, బీజేపీ కుమ్మక్కయిందని ఇట్టే అర్థమవుతోంది. కానీ,ఒక్క విషయం ఈసీ గుర్తెరగాలి. ఈ రోజు రాహుల్, రేపు మరొకరు ఎవరైనా ఇలాంటి ఆరోపణలు చేస్తే ఇదే తరహాలో ఖండించి ఊరుకుంటే ఈ దేశ ఓటర్ల మదిలో అనేక సందేహాలు గూడు కట్టుకుంటాయి. అలా జరగడానికి అవకాశమివ్వకూడదు. ఎన్నికలు వస్తాయి..పోతాయి, రాజకీయ పార్టీలు కూడా గెలుస్తాయి..ఓడుతాయి, కానీ ప్రజాస్వామ్యం నిలబడాలి. అది జరగాలంటే ఎన్నికల వ్యవస్థ బలంగా ఉండాలి, దానిపై అనుమానాలు, అపోహలు ఉండకూడదు, రాకూడదు. అలా జరగొద్దని ఈసీ భావించాలి. ఓట్ చోరీ.. ఓట్ల తొలగింపుపై ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ దేశానికి సరైన సమాధానం చెప్పాల్సిన అవసరం ఉన్నది.

## శ్రీశైల మహాక్షేత్రంలో యాగశాల ప్రవేశంతో వైభవంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు

మనగలం : శ్రీశైలం సెప్టెంబర్ 23 : శ్రీశైల మహక్షేత్రంలో దసరా మహోత్సవములు సోమవారం నాడు వైభవంగా యాగశాల ప్రవేశంతో ఉదయం ప్రారంభమయ్యాయి. పడకొండు రోజులపాటు జరిగే ఈ మహోత్సవాలు అక్టోబరు 2తేదీతో ముగియనున్నాయి. సంప్రదాయాన్ని అనుసరించి శాస్త్రోక్తంగా నిర్వహించబడే ఈ ఉత్సవాలలో ప్రతిరోజు శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు,శ్రీ అమ్మవారికి విశేష అలంకరణలు, ప్రత్యేక నవావరణ పూజలు, స్వామిఅమ్మవార్లకు వాహనసేవలు, చండీహెూమం, రుద్రహెూమం, జపములు, పారాయణలు జరుపబడుతున్నాయి.

ఆలయ ప్రవేశం

ఉత్సవ నిర్వహణలో భాగంగా ముందుగా కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు దంపతులు, ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, స్థానాచార్యులు, అర్చకస్వాములు, వేదపండితులు,అధికారులు ఆలయ ప్రవేశం చేశారు. సంప్రదాయబద్దంగా పసుపు, కుంకుమలు, ఫలపుష్పాదులతో ఆలయ ప్రవేశం చేయడం ఈ ఉత్సవాలకు నాందిగా ఈ ఉదయం 9.00 గంటలకు అమ్మవారి ఆలయమండపంలో యాగశాలప్రవేశం, గణపతిపూజ, దీక్షాసంకల్పం, కంకణపూజ, కంకణధారణ, ఋత్విగ్వరణం కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. అనంతరం అమ్మవారి యాగశాలలో అఖండదీపస్థాపన, వాస్తుపూజ, మండపారాధనలు, చండీకలశస్థాపన, శ్రీచక్రార్చన, నవగ్రహజపాలు, చతుర్వేద పారాయణలు, చండీసప్తశతి, మహావిద్యా పారాయణలు, సూర్యనమస్కారాలు జరిగాయి. అదేవిధంగా స్వామివారియాగశాలలో యాగశాలప్రవేశం, గణపతిపూజ, శివసంకల్పం, అఖండ దీపస్థాపన, వాస్తుపూజ, మండపారాధనలు, రుద్రకలశస్థాపన కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవ సంకల్పం : లోకకల్యాణం కోసం నిర్వహించబడే ఈ ఉత్సవ సంకల్పంలో అతివృష్టి, అనావృష్టి నివారించబడి, సకాలములో తగినంత వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, దేశం సుభిక్షంగా ఉండి, సుఖశాంతులు విలసిల్లాలని, అకాల మరణాలు సంభవించకుండా ఉండాలని, జనులందరికీ సుఖసంతోషాలు కలగాలని పేర్కొనబడింది.



గణపతిపూజ

సంకల్పపఠనం తరువాత ఉత్సవాలు నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడింది. గ్రామోత్సవంలో కళారూపాలు

నాదస్వరం, కేరళ చండీ మేళం, కొమ్ము, కోయ నృత్యం, థయ్యం (సంప్రదాయ నృత్యం), విళక్కు (సంప్రదాయ నృత్యం), స్వాగత నృత్యం (సంప్రదాయ నృత్యం), కోలాటం, రాజభటుల వేషాలు, జానపద పగటి వేషాల ప్రదర్శన, అశ్వ ప్రదర్శన, డమరుకం, చిడతలు, శంఖం, పిల్లన్నగ్రోవి, శంఖం, త్రిశూలం, జేగంట, కంచుడోలు, కొమ్ము, తాళాలు, చెక్కభజన, చిడతలు, శంఖం, అమ్మవారి వేషం, తప్పెట చిందు, డోలు విన్యాసం, వీరభద్ర డోలుకుణిత కన్నడ జాపద కార్యక్రమము

## చెల్లబండ గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం పై పర్యవేక్షణ చేస్తూ పంచాయతీ సెక్రెటరీ, గ్రీన్ అంబాసిడర్ కి తగు సూచనలు







మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండలం ఎర్రదొడ్డి గ్రామపంచాయతీ మజార గ్రామమైన చెల్లబండ గ్రామాన్ని సందర్శించి ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం పై పర్యవేక్షణ చేస్తూ పంచాయతీ సెక్రెటరీ, గ్రీన్ అంబాసిడర్ కి తగు సూచనలు అందించారు గ్రామపంచాయతీ సిబ్బంది కచ్చితంగా ప్రతి ఇంటి దగ్గర నుంచి కూడా చిత్త సేకరణ చేయాలి ఐవిఆర్ఎస్ కాల్స్ మీద అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా వారు తెలియజేశారు ఇందులో భాగంగా ఎర్రదొడ్డి సచివాలయం పరిధిలోని ఎస్ డబ్ల్యు పిసి షెడ్ ను కూడా సందర్శించి ఆ షెడ్డు నిరుఉపయోగంగా ఉన్నందున ఉపయోగం లోకి తీసుకురావాలని పంచాయతీ సెక్రెటరీ సర్పంచులకు సూచనలు ఇవ్వడం జరిగినది గ్రామపంచాయతీని సందర్శించి గ్రామపంచాయతీలో సమీత్వ కార్యక్రమాలు జరిగే విధానంపై పర్యవేక్షణ చేస్తూ పంచాయతీ సెక్రెటరీ తర్వాత పూర్తి చేయాలని ఆదేశించడం అయినది గ్రామపంచాయతీ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు

## వర్కూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలోని వర్కూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్ , ఏ ఈ ఓ లక్ష్మీ నారాయణతో మాట్లాడుతూ

పంట నమోదు చేయించుకోవాలని గ్రామ రైతులకు, మండల రైతులకు సూచించారు. ఉల్లి పంట సాగు చేసిన ప్రతి రైతు కూడా పంట నమోదు చేయించుకోవాలని, పత్తి వేసిన రైతులు 13- 0- 45, మైక్రో న్యూట్రియంటును ఎకరాకు కేజీ చొప్పున స్ప్రే చేసుకోవాలని, పత్తిలో తెల్ల దోమ గాని పచ్చ దోమలు గాని ఉన్నట్లయితే ఈ మిడా క్లోపేడ్ 250 మందును స్ప్రే చేసుకోవాలని, పత్తిలో జీడ ఉన్నట్లయితే అష్టమా ప్రిడ్ 100 గ్రాముల ఎకరాకి స్ప్రే చేసుకోవాలని ఈ సందర్భంగా రైతులకు తగు సూచనలు అందించారు ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

## పన్నులు తగ్గడంతో మారుతీ సుజుకి, హ్యూండాయ్ కార్ల కోసం రికార్డు బుకింగ్‌లు




మన గళం : జీఎస్టీ పన్నులు తగ్గడంతో పాటు పండుగ సీజన్, కంపెనీలు ధరలు సవరించడంతో ఈ ఏడాదికి వాహన పరిశ్రమ రికార్డు స్థాయిలో డిమాండ్‌ను చూస్తోంది. ఇప్పటికే మారుతీ సుజుకి, హ్యూండాయ్ మోటార్ ఇండియా ఊహించని స్థాయిలో బుకింగ్‌లు సాధించామని వెల్లడించాయి. దేశీయ అతిపెద్ద ప్యాసింజర్ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకి ఇప్పటికే అత్యధిక ఎంక్వైరీలు, బుకింగ్‌లు అందుకున్నామని తెలిపింది. గత 35 ఏళ్లలో చూడని స్థాయిలో జీఎస్టీ తగ్గింపు నిర్ణయం అమలులోకి రావడంతో సోమవారం మొదటిరోజే 80,000 ఎంక్వైరీలు వచ్చాయని, 25,000 కంటే ఎక్కువ కార్లను డెలివరీ చేశామని వెల్లడించింది. ఇప్పటివరకు 75,000 బుకింగ్‌లు వచ్చాయని, రోజుకు 15 వేల బుకింగ్‌లు జరుగుతున్నాయి. త్వరలో మేము 30,000 డెలివరీలు ఇవ్వగలమని, ఇప్పటివరకు బుకింగ్‌లు సాధారణంగా వచ్చే దానికంటే 50 శాతం ఎక్కువ బుకింగ్‌లు అవుతున్నాయని మారుతీ సుజుకి మార్కెటింగ్, సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ పార్థో బెనర్జీ అన్నారు. హ్యూండాయ్ మోటార్ సైతం నవరాత్రి మొదటి రోజు కావడంతో ఐదేళ్లలోనే అత్యధిక సింగిల్–డే బిల్లింగ్ జరిగినట్టు కంపెనీ హెూల్–టైమ్ డైరెక్టర్, సీఓఓ తరుణ్ గార్గ్ పేర్కొన్నారు.

## తగ్గిన ఉత్పత్తులతో 'జీఎస్టీ స్టోర్' ప్రత్యేక సెక్షన్ ప్రారంభించిన అమెజాన్

మన గళం : కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేసిన జీఎస్టీ సంస్కరణలకు సంబంధించి కస్టమర్లకు ప్రయోజనాలను అందించేందుకు ఈ–కామర్స్ సంస్థలు చర్యలు తీసుకుంటున్నాయి. అందులో భాగంగానే అమెజాన్ ఇండియా కూడా తగ్గిన పన్నుల గురించి కస్టమర్లకు తెలిసేలా ప్రత్యేక సెక్షన్‌ను తీసుకొచ్చింది. పన్నులు తగ్గిన ఉత్పత్తులు విడిగా కనిపించేలా 'జీఎస్టీ స్టోర్ ' పేరుతో సెక్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఎలక్ట్రానిక్స్, గృహెూపకరణాలు, ఇతర విభాగాల్లో తక్కువ ధరలు ఉన్న వాటిని ఈ సెక్షన్‌లో పొందుపరిచింది. మంగళవారం(సెప్టెంబర్ 23) నుంచి గ్రేట్ ఇండియా ఫెస్టివల్ సేల్ ప్రారంభం కానుండటంతో అమెజాన్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రైమ్ సభ్యులకు సెప్టెంబర్ 22 అర్ధరాత్రి నుంచే ముందస్తు యాక్సెస్ లభిస్తుంది. జీఎస్టీ స్టోర్ బ్యాడ్జ్ వల్ల కస్టమర్లు తగ్గిన పన్ను ఆఫర్లను సులభంగా గుర్తించడం, షాపింగ్ చేయడానికి వీలవుతుంది. ప్రైమ్ ఎర్లీ యాక్సెస్ సమయంలో ఈ బ్యాడ్జ్ ప్రైమ్ డీల్‌ంజీఎస్టీ సేవింగ్స్ అని ఉంటుంది. సేల్ అందరికీ ఉన్న సమయంలో డీల్ విత్ జీఎస్టీ సేవింగ్స్ అని కనిపిస్తుందని అమెజాన్ వెల్లడించింది.



# దసరా సెలవులలో ప్రభుత్వా నియమ నిబంధనాలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి: ఏఐఎస్ఎఫ్

మన గళం కోడుమూరు: కోడుమూరు పట్టణంలో ఉన్న సిపిఐ ఆఫీసులో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. అన్ని ప్రైవేట్ పాఠశాలలు క్లాస్ ల పేరుతో స్కూల్ లను నడపకూడదు, వారు పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ఎస్.అల్తాఫ్ బాషా మాట్లాడుతూ దసరా సెలవులలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు తరగతులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిఇఓ, ఆర్ఐఓ చెప్పడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్నటువంటి పోటీ చదువుల వలన విద్యార్థులు చాలా మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. ఇలాంటి సమయంలో విద్యార్థులకు మానసిక ఒత్తిడి నుంచి దసరా సెలవులలో ఉపశమనం కలిగించేందుకు, ఈ సెలవులు ఉపయోగ పడతాయన్నారు. కానీ ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నియమా నిబంధనలను తుంగలోదొక్కి సెలవుల్లో కూడా తరగతులు నిర్వహిస్తే, విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత మండల విద్యాశాఖ అధికారులకు ఎంతైనా ఉందన్నారు. కేవలం పేపర్ల ప్రకటనలకు పరిమితం కాకుండా ఈ విషయంలో అధికారులు తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని ఆయన కోరారు. సెలవుల్లో ప్రైవేట్ విద్యా సంస్థలు తరగతులు నిర్వహించిన




విద్యాసంస్థలపై అధికారులు చర్యలు తీసుకోకపోయినా యడల అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) గా విద్యార్థిని, విద్యార్థులకు అండగా ప్రత్యక్షంగా ఆందోళనలు చేపడుతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల నాయకులు వీరేంద్ర, వినయ్ నాయుడు మునిస్వామి, అభి తదితరులు పాల్గొన్నారు...లి

# కర్నూలు జిల్లాకు దామోదరం సంజీవ పేరు పెట్టాలని కోడుమూరు నందు పెద్ద ఎత్తున సంతకాల సేకరణ

మన గళం కోడుమూరు: కోడుమూరు నియోజక వర్గ ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, కులసంఘులు పెద్దఎత్తున సంతకాలు సేకరించారు రాజకీయాలలో విలువలు నేర్పిన ప్రజానాయకుడు దామోదరం సంజీవయ్య కర్నూల్ జిల్లాకు దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని ప్రజాభీష్టం కొరకు నేడు కోడుమూరు లోని సిపిఐ కార్యాలయం ఎదుట దామోదరం సంజీవ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో కోడుమూరు నియోజక వర్గ ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, కులసంఘులు పెద్దఎత్తున సంతకాలు సేకరించారు. ఈసందర్భంగా గౌరవధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు ప్రధాన కార్యదర్శి దాసరి రామశేషయ్య, దామోదరం రాధాకృష్ణ మూర్తి మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు అధ్యుడు దామోదరం సంజీవయ్య. కర్నూల్ జిల్లా ప్రజల 40సంవత్సరాల చిరకాల వాంఛ దామోదరం సంజీవయ్య జిల్లా అని ప్రభుత్వం దీన్ని ఆమోదించాలని ఈ సందర్భంగా వారు తెలియజేశారు కోడుమూరు ప్రజల సాగునీరు తాగునీరు ఇచ్చి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహానేత సంజీవయ్య ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆయనను అయన నిజాయితీని గౌరవించాలని ఈ సందర్భంగా వారు తెలియజేశారు ఈ సంతక సేకరణ కార్యక్రమంలో స్థానిక నాయకులు వైస్సార్సీపీ జిల్లా కార్యదర్శి లాయర్ ప్రభాకర్,



సిపిఎం చేనేత రాష్ట్రనాయకులు రాజు, సిపిఐ తాలూకా నాయకులు బి. రాజు, మాలమహానాడు నాయకులు మునిస్వామి, %ఎతీజూం% నాయకులు నాగేష్, దయాకర్, ఏకంబరం. సిపిఎం నాయకులు జి. పి వీరన్న తదితరులు పాల్గొన్నారు

# పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలి

- ప్రతి గ్రామాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దుదాం
- కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి
- మంచినీటి ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలి
- ప్రజలకు మెరుగైన రీతిలో సేవలు అందించాలి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

మనగళం, నంద్యాల: జిల్లాలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేసి ప్రతి పల్లెను చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, పంచాయతీ సెక్రటరీలతో తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు రోడ్ల పైన చెత్తాచెదారాన్ని తొలగిస్తూ ఇంటి పరిసర ప్రాంతాలలో చెత్త కుప్పలు, పేడ దెబ్బలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ అధికారులు, పంచాయతీ సిబ్బంది, పబ్లిక్ హెల్త్ అధికారులు సమన్వయంతో ప్రజలకు మంచినీటి సరఫరాలో ఎటువంటి సమస్యలు లేకుండా స్వచ్ఛమైన నీరు అందించాలన్నారు. నీరు కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంచినీటి ట్యాంకులలో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేసి శుభ్రపరచాలన్నారు. ఈవోపీఆర్డీలు పంచాయతీ సిబ్బంది క్షేత్రస్థాయిలో గ్రామాలలో పర్యటించి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతని, పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన జీవితం గడపడానికి అవకాశం ఉంటుందన్నారు. పరిసరాలు పరిశుభ్రత వల్ల అంటువ్యాధులతోపాటు అనేక రకాలైన వ్యాధులను నివారించవచ్చని, అలాగే దోమల నివారణ సాధ్యపడుతుందని, దోమల వల్ల వచ్చే వ్యాధులను కూడా అరికట్ట వచ్చునని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నంద్యాల జిల్లాకు మంజూరైన కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డబ్ల్యూఎస్ ఏఈలకు సూచించారు. ముఖ్యంగా హాస్టల్లలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇలా ప్రతి అంశంలో మన జిల్లాను మొదటి స్థానంలో ఉంచేందుకు ప్రతి అధికారి తమ వంతు బాధ్యతగా పనిచేయాలన్నారు.



# 375 వస్తువుల ధరలు తగ్గుతాయ్

మనగళం, గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్టీ) సంస్కరణలు సెప్టెంబర్ 22, 2025 నుంచే అమలులోకి వస్తున్నాయి. ఈనెల మొదటి వారంలో వస్తు సేవల పన్ను మండలి కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. 5, 18 శాతం పన్ను శ్లాబులను కొనసాగిస్తూ 12, 28 శ్లాబులను తొలగించింది. దీంతో సెప్టెంబర్ 22 నుంచి 5, 18 శాతం పన్ను శ్లాబులే అమలు అవుతాయి. దీంతో ఏకంగా 375 రకాల వస్తువుల ధరలు తగ్గనున్నాయి. ఈ జాబితాలో డైరీ ప్రొడక్ట్స్, కార్లు, ఔషధాలు, వంట సామగ్రి నుంచి ఎలక్ట్రానిక్స్ వరకు చాలా కేటగిరీల వస్తువులు ఉన్నాయి. ఏ వస్తువుల ధరలు తగ్గుతున్నాయి? ముఖ్యమైన వాటి జాబితా ఇప్పుడు మనం తెలుసుకుందాం.

ఆహార పదార్థాల జాబితాలో పాలతో ఉన్న పానియాలు, ఘనీభవించిన పాలు, బిస్కెట్లు, కార్న్ ఫ్లేక్స్, సీరల్స్, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, డ్రై ఫ్రూట్స్, ఫ్రూట్ పల్ప్, ఫ్రూట్ జూస్, నెయ్యి, ఐస్ క్రీమ్, జామ్, ఫ్రూట్ జెలీస్, కెచప్, ఉప్పు, పనీర్, పాస్ట్రీ, మాంసం, ప్యాకేజ్డ్ కొబ్బరీ నీళ్లు ఉన్నాయి.

షేవ్ లోషన్, ఫేస్ క్రీమ్, ఫేస్ పౌడర్, హెయిర్ ఆయిల్, షాంపూ, షేవింగ్ క్రీమ్, టాల్కమ్ పౌండర్, టూత్ బ్రస్, టాయిలెట్ సబ్బులు వంటివి ఉన్నాయి. ఎయిర్ కండీషనర్లు, డిష్ వాషర్స్, టీవీలు, వాషింగ్ మెషన్స్ ఉన్నాయి. దయాగ్నస్టిక్ కిట్లు, గ్లూకో మీటర్లు వంటి మెడికల్ డివైజులపై జీఎస్టీ 5 శాతానికి తగ్గుతుంది. దీంతో వాటి ధరలు తగ్గుతాయి. వాటిపై ఎంఆర్‌పీ ధరలను తగ్గించాలని కేంద్రం ఫార్మసీలను ఆదేశించింది. బార్బెర్స్, ఫిట్‌నెస్ సెంటర్స్, హెల్త్ క్లబ్స్, సెలూన్స్, యోగా కేంద్రాల వంటి వాటిపై జీఎస్టీ తగ్గుతుంది. వాటి ధరలు దిగివస్తాయి. ఇంటి కొనుగోలుదారులు లేదా నిర్మాణదారులకు జీఎస్టీ ద్వారా భారీగా ప్రయోజనం కలగనుంది. సిమెంట్ ధరలపై జీఎస్టీ 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గుతుంది. దీంతో నిర్మాణ ఖర్చు భారీగా తగ్గనుంది. కార్లు, ఇతర వాహనాలపై జీఎస్టీ భారీగా తగ్గుతుంది. ఇంతకు ముందు పన్నులు సెస్ తో కలిపి 35 శాతం నుంచి 50 శాతం వరకు ఉండేవి. ఇప్పుడు ఫ్లాట్ 40 శాతం గా మార్చారు. సెస్ ఎత్తివేశారు. దీంతో గరిష్ఠ పన్ను ఇదే. అలాగే చిన్న కార్లపై జీఎస్టీని 18 శాతానికి తగ్గించారు. ఇప్పటికే మారుతీ, టాటా వంటి కంపెనీలు ధరల తగ్గింపు ప్రకటనలు చేశాయి. వీటితో పాటు ప్రముఖ కన్స్యూమర్ బ్రాండ్లు అముల్, హెచ్‌యూఎల్, లోరియల్, హిమాలయా వంటివి తమ ఉత్పత్తులపై ధరలు తగ్గిస్తున్నట్లు ప్రకటనలు చేశాయి.

# జనన సర్టిఫికెట్లు వెంటనే జారీ చేయండి







మనగళం, నంద్యాల టౌన్ : ఆసుపత్రుల్లో జన్మించే ప్రతి నవజాత శిశువుకి వెంటనే జనన ధ్రువపత్రం (డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికేట్) జారీ చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత వైద్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ - ఎయిడ్స్ నియంత్రణ అండ్ నివారణా విభాగం, జనన, మరణ నమోదు కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఇకపై ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో శిశువు జననం జరిగిన వెంటనే ఆసుపత్రి ద్వారానే రిజిస్ట్రేషన్ పూర్తవ్వాలని, తల్లిదండ్రులు ధ్రువపత్రం కోసం తిరగాల్సిన అవసరం లేకుండా వెంటనే జనన సర్టిఫికెట్ అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ విధానం ద్వారా ప్రతి శిశువు పుట్టిన రోజునే అధికారిక రికార్డుల్లో నమోదు కావడంతో భవిష్యత్తులో చదువు, ఆధార్, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ వంటి అవసరాల కోసం ఎటువంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. ప్రతి ఆసుపత్రి వార్డులో జనన%-%మరణ నమోదు సిబ్బందిని ఉంచి, జననం జరిగిన వెంటనే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. తల్లిదండ్రుల నుండి అవసరమైన సమాచారం సేకరించి, డిజిటల్ రికార్డుల ఆధారంగా తక్షణమే సర్టిఫికెట్ జారీ చేయాలని ఆమె ఆదేశించారు. ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరిగిన జననాలకు సంబంధించి శిశువు పేరును అదే రిజిస్ట్రేషన్ నంబర్‌కు 15 సంవత్సరాల లోపు ఎప్పుడైనా నమోదు చేసుకోవచ్చని, అయితే, ఒక సంవత్సరం లోపల నమోదు చేస్తే ఉచితంగా నమోదు చేయబడుతుందన్నారు. ఒక సంవత్సరం దాటిన తరువాత ప్రభుత్వం నిర్దేశించిన రుసుము చెల్లించి మాత్రమే నమోదు చేసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. డూప్లికేట్ జననాలు నమోదవకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిపిఓను ఆదేశించారు. సంవత్సరం తరువాత జరిగే జననాలు, మరణాలు ఆర్డీఓ అనుమతితో మాత్రమే నమోదు చేయాలన్నారు. అనుమతి లేకుండా పంచాయతీ సెక్రటరీలు నమోదు చేస్తే వారి పై కఠినమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరిగిన జననాలు, మరణాలు ప్రభుత్వము నిర్దేశించిన సమయానికి తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లావైద్యా ఆరోగ్య శాఖా అధికారులు డా. వెంకటరమణ, డా. శారదా భాయి, మహిళా శిశు శాఖా అధికారి లీలావతి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మల్లీశ్వరి, ట్రైబల్ వేల్ ఫర్ అధికారి,ఇంటర్ విద్యా శాఖా అధికారి, ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అలీ హైదర్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష డాలర్ల ఫీజు నుంచి కీలక రంగాలకు మినహాయింపు




మనగళం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్తగా జారీ చేసే హెచ్-1బీ వీసాలపై విధించిన లక్ష డాలర్ల ఫీజు మనదేశంలో ప్రధానంగా ఐటీ రంగంలో తీవ్ర ఆందోళనకు కారణమైంది. ఈ నెల 21 నుంచే కొత్త నిబంధన అమల్లోకి వచ్చింది. ఇందుకోసం అధ్యక్షుడు జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ఒక ఏడాది పాటు అమల్లో ఉంటుంది. ఈలోపు అమెరికా చట్టసభ కాంగ్రెస్‌లో చట్టం చేస్తే, ఆ తర్వాత పూర్తిస్థాయిలో అమల్లో ఉంటుంది. మనదేశం నుంచి హెచ్-1బీ వీసాపై అమెరికాకు వెళ్లే ఒక ఉద్యోగి సగటు వార్షిక వేతనం 60,000- 140,000 డాలర్ల మధ్యలో ఉంటుంది. ఈ పరిస్థితుల్లో హెచ్-1బీ వీసా కోసం ఒక ఉద్యోగిపై లక్ష డాలర్ల ఫీజు చెల్లించడానికి కంపెనీలు ముందుకు రావటం ఎంతో కష్టం. ఈ భారం నుంచి ఎవరికైనా మినహాయింపులు ఉన్నాయా అనేది ఆసక్తికం అంశం. జాతీయ ప్రాధాన్యం లేదా అమెరికా అవసరాల కోసం.. కొన్ని రంగాలకు ఈ ఫీజు నుంచి మినహాయించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వివరిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లోని సెక్షన్ 1 (సి)లో మినహాయింపుల ప్రస్తావన ఉంది. యూఎస్‌లోని హెూమ్‌ల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శికి ఈ మినహాయింపులపై అధికారం ఉంది. ఆయన తన విచక్షణ వినియోగించవచ్చు. విశేష నైపుణ్యం గల వారిని అమెరికాకు ఆహ్వానించే లక్ష్యంతో ఈ మినహాయింపుల అవకాశాన్ని కల్పించినట్లు తెలుస్తోంది. వైద్యులు, మెడికల్ రెసిడెంట్లకు మినహాయింపు ఇచ్చినట్లు సమాచారం. వీరితోపాటు మరికొన్ని రంగాల్లోని అత్యంత నైపుణ్యం గల ఉద్యోగులు హెచ్-1బీ వీసా కోసం లక్ష డాలర్ల ఫీజు భారాన్ని తప్పించుకునే అవకాశం కనిపిస్తోంది.

బుధవారం
24 - 09 - 2025

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# గ్లామర్ షోతో సోషల్ మీడియా హీట్ ఎక్కిస్తున్న తమన్నా..



మన గళం, సినిమా : గ్లామర్ షో చేయడం మొదలుపెడితే నాకంటే బాగా ఎవరూ చేయలేరు అంటున్నారు తమన్నా. ఈ బ్యూటీ పెంచేస్తున్న హీట్‌కు థర్మామీటర్లు సైతం పేలిపోతున్నాయి. ఈమె గ్లామర్ షోతో సోషల్ మీడియా హీట్ ఎక్కిపోతుంది. ఇంతకంటే డోస్ పెంచదు అన్న ప్రతీసారి.. దానికి మించి పెంచేస్తూ వేడి రాజేస్తున్నారు మిల్కీ బ్యూటీ. తాజాగా మరోసారి ఇదే చేసారీమె. చూస్తున్నారుగా.. తమన్నా లేటెస్ట్ వీడియో సాంగ్..! ఈ ఒక్క పాటతో యూ ట్యూబ్ మాత్రమే కాదు.. సోషల్ మీడియా కూడా తగలబడిపోతుంది. ఈమె గ్లామర్ షో చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. షారుక్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ దర్శకత్వంలో వచ్చిన ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్ సిరీస్ కోసం నెక్స్ట్ లెవల్ గ్లామర్ షో చేసారు మిల్కీ బ్యూటీ.తమన్నా గ్లామర్ షో చేయడం ఇదేం కొత్త కాదు.. కానీ ఇంతగా రెచ్చిపోవడం మాత్రం ఇదే తొలిసారి. బాలీవుడ్‌లో రోజురోజుకీ పెరుగుతున్న పోటీ తట్టుకోవాలంటే.. ఈ మాత్రం షో తప్పదంటున్నారు మిల్కీ బ్యూటీ. గఫూర్ సాంగ్ మాత్రమే కాదు.. ఈ మధ్య బాలీవుడ్‌లో ఏ సాంగ్ చేసినా కూడా పీక్స్‌లో రెచ్చిపోతున్నారు తమన్నా. పైగా తమన్నా స్పెషల్ సాంగ్ చేస్తే తమ సినిమా హిట్ అని భావిస్తున్నారు మేకర్స్. ఇదే వెబ్ సిరీస్‌ల వరకు వచ్చింది కూడా..! కెరీర్ మొదట్నుంచీ గ్లామర్ షో చేసినా హద్దుల్లో ఉన్న తమన్నా. ఈ మధ్య ఇంటిమేట్ సీన్స్‌కు కూడా ఓకే అనేస్తున్నారు. ఇప్పుడున్న పోటీలో ఉనికి చాటుకోవడం కోసం సిద్ధంగా ఉండాల్సిందే అంటున్నారు ఈ బ్యూటీ.





## రణబీర్ కపూర్ ఇ-సిగరెట్ వివాదం.. ఎన్‌హెచ్ఆర్‌సీ నుంచి నోటీసులు

మన గళం, సినిమా : బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ తనయుడు 'ఆర్యన్ ఖాన్' దర్శకత్వం వహించిన 'బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్' అనే వెబ్ సిరీస్ ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్న విషయం తెలిసిందే. ఈ వెబ్ సిరీస్‌తో డెబ్యూతోనే మంచి మార్కులు సంపాదించాడు ఆర్యన్ ఖాన్. అయితే సిరీస్‌లో రణబీర్ కపూర్ ఇ-సిగరెట్(ఎలక్ట్రానిక్ సిగర్) తాగిన సన్నివేశం వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. దీనిపై నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) జోక్యం చేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ వెబ్ సిరీస్‌లో అతిథి పాత్రలో మెరిశాడు రణబీర్ కపూర్. అయితే ఇందులో ఒక సన్నివేశంలో రణబీర్ కపూర్ ఇ-సిగరెట్ తాగుతూ కనిపిస్తాడు. ఇండియాలో 2019 నుంచి ఎలక్ట్రానిక్ సిగరెట్ల వాడకంపై నిషేధం ఉంది. దీంతో నిషేధం విధించిన ఇ-సిగరెట్‌ను ఎలా వాడతరంటూ ఈ సన్నివేశంపై వినయ్ జోషి అనే వ్యక్తి ఎన్‌హెచ్ఆర్‌సీ కు ఫిర్యాదు చేశారు. నిషేధిత వస్తువులను ఉపయోగించడమే కాకుండా, ఎటువంటి హెచ్చరికలు లేదా డిస్‌క్లెయిమర్‌లు లేకుండా ఈ సన్నివేశం ప్రసారం చేయబడిందని ఆయన ఆరోపించారు. ఇక ఈ ఫిర్యాదును స్వీకరించిన ఎన్‌హెచ్ఆర్‌సీ కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శికి అలాగే ముంబై పోలీసులకు నోటీసులు జారీ చేసింది. అలాగే రణబీర్ కపూర్, నెట్‌ఫ్లిక్స్ సంస్థ, సిరీస్ నిర్మాతలపై కేసు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. యూత్ ను తప్పుదోవ పట్టించేలా ఈ సన్నివేశం ఉందని ఎన్‌హెచ్ఆర్‌సీ సీరియస్ అయింది. ఈ విషయంలో తీసుకున్న చర్యలపై వివరణాత్మక నివేదికను సమర్పించాలని చిత్ర నిర్మాతలను ఆదేశించింది. అయితే ఈ వివాదంపై రణబీర్ కపూర్, నెట్‌ఫ్లిక్స్ లేదా సిరీస్ బృందం ఇంకా స్పందించలేదు.

## షూటింగ్‌లో నాలుగు సార్లు ప్రమాదం జరిగింది.. దేవుడే నన్ను బ్రతికించాడన్న కాంతార హీరో..




మన గళం, సినిమా : ప్రముఖ కన్నడ నటుడు, దర్శకుడు రిషబ్ శెట్టి తెరకెక్కించిన 'కాంతార చాప్టర్ 1' సినిమా రిలీజ్‌కు ముందే భారీ అంచనాలు క్రియేట్ చేస్తోంది. సెప్టెంబర్ 22న విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుండి అద్భుతమైన స్పందన లభించడంతో, సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.ఈ నేపథ్యంలో బెంగళూరులో జరిగిన విలేకరుల సమావేశంలో చిత్రబృందం మీడియాతో మాట్లాడింది. ఇందులో రిషబ్ శెట్టి వివిధ అంశాలపై స్పందించగా, ఒక వివాదాస్పద పోస్టర్ చర్చకు తెరలేపింది. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోన్న ఓ పోస్టర్‌లో, "కాంతార సినిమాను చూడటానికి వచ్చే వారు మాంసాహారం తినకూడదు, మద్యం సేవించకూడదు, పొగ తాగకూడదు" అనే వివాదాస్పద వ్యాఖ్యలు ప్రచారం కావడంతో దానికి సంబంధించి రిషబ్ శెట్టిని విలేకరులు ప్రశ్నించారు. అది పూర్తిగా నకిలీ పోస్టర్. మా ప్రొడక్షన్ హౌస్‌కు దానికి ఎటువంటి సంబంధం లేదు. ఎవరో కావాలనే నకిలీగా తయారుచేసిన పోస్టర్ అది. మా దృష్టికి వచ్చిన వెంటనే వారు తొలగించి క్షమాపణలు చెప్పారు అని వివరించారు. ఈ విషయాన్ని కొంత మంది తప్పుడు దిశగా తీసుకెళ్లే ప్రయత్నం చేశారని చెప్పిన రిషబ్ శెట్టి, "ప్రతి ఒక్కరికి వారి ఆహార అలవాట్లు, జీవనశైలి ఉంటాయి. వాటిని ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదు. సినిమా ఓ ట్రెండ్‌గా మారినప్పుడు, కొందరు తమ స్వంత ఆలోచనలతో వాటిని వక్రీకరించే ప్రయత్నం చేస్తారు. సోషల్ మీడియాలో వైరలవ్వాలన్నదే వారి ఉద్దేశం అన్నారు. సినిమా ప్రారంభంలో చాలా మంది కొన్ని ప్రతిజ్ఞలు చేశారని పోస్టర్స్ బయటకు వచ్చాయి.అందులో టీమ్ అంతా మద్యం, ధూమపానానికి దూరంగా ఉండనున్నట్టు రాసి ఉంది. వాటిపై కూడా రిషబ్ శెట్టి క్లారిటీ ఇస్తూ ఫేక్ అని కొట్టిపడేశారు. ఇక షూటింగ్ సమయంలో తాను నాలుగు సార్లు ప్రమాదం బారిన పడ్డట్టు చెప్పుకొచ్చారు. ఆ సమయంలో తాను చనిపోయేవాడినని, ఆ దేవుడే నన్ను కాపాడాడు. ఆయన వల్లే ఈ సినిమా షూటింగ్ సక్సెస్ ఫుల్‌గా ముగిసింది అని రిషబ్ శెట్టి స్పష్టం చేశారు. తాజాగా విడుదలైన ట్రైలర్‌లో కొన్ని శాంపిల్స్ మాత్రమే చూపించి అసలైన స్టఫ్ దాచిపెట్టరేమో అనే అనుమానం కొందరిలో కలుగుతుంది.

## కామెడీ బతికితే అందరూ హ్యాపీ!




మన గళం, : ప్రియదర్శి, నిహారిక ఎన్.ఎం, విష్ణు ఓఐ, రాగ్ మయూర్, ప్రసాద్ బెహారా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మిత్రమండలి'. విజయేందర్ ఎస్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో 'జంబర్ గింబర్ లాలా..' అంటూ సాగే మూడో గీతాన్ని ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. తమ జీవితం ఎలా ఉన్నా అందరినీ నవ్వించాలనే లక్ష్యంతో కమెడియన్స్ పనిచేస్తుంటారని, కామెడీ బతికితే అందరూ ఆనందంగా ఉంటారని అన్నారు. తాను బ్రహ్మానందానికి ఏకలవ్య శిష్యుడినని, ఈ సినిమాలో ఆయనతో కలిసి నటించడంతో కల నిజమైందని ప్రియదర్శి తెలిపారు. ప్రేక్షకుల ముఖాలపై నవ్వులు పూయించడానికే ఈ సినిమా తీశామని బన్నీ వాసు అన్నారు. బ్రహ్మానందంగారి 'జంబర్ గింబర్ లాలా' అనే పాపులర్ డైలాగ్‌తో ఈ పాట చేసి ఆయన పట్ల అభిమానాన్ని చాటుకున్నామని సంగీత దర్శకుడు ఆర్.ఆర్.ధృవన్ పేర్కొన్నారు.

## ప్రేమలో రెండోసారి



మన గళం,రమణ సాకే, వనిత గౌడ జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రేమలో రెండోసారి'. సత్య మార్క దర్శకుడు. సిద్ధ క్రియేషన్ పతాకంపై నీరజ లక్ష్మి నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను ఇటీవల ప్రముఖ దర్శకుడు తేజ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. ఈ భూమి ఉన్నంత వరకు ప్రేమకు మరణం లేదనే హృద్యమైన పాయింట్‌తో ఈ సినిమాను తెరకెక్కించారని అన్నారు. నేటి యువత మెచ్చే చిత్రమిదని, అక్టోబర్‌లో విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు సత్య మార్క పేర్కొన్నారు. జబర్దస్త్ శ్రీను, బాబీ, దుర్గారావు, జబర్దస్త్ ఫణి, సతీష్ సారపల్లి తదితరులు ఈ చిత్ర తారాగణం.

# రెచ్చగొట్టిన పాక్ ఆటగాళ్లు..గెలిచి చూపించిన భారత్



మన గళం, ఇండియా - పాకిస్తాన్ మ్యాచ్ అంటే చాలు. అది క్రికెట్ సహా ఏ క్రీడ అయినా కూడా జనాల్లో ఆసక్తి ఉంటుంది. ఫుట్‌బాల్ కావచ్చు, పింగ్ పాంగ్ అయినా సరే రెండు దేశాల మధ్య మ్యాచ్ అంటే రసవత్తరంగా మారుతుంది. ఇటీవల జరిగిన ఆసియా కప్ 2025లో కూడా అదే తీరు కనిపించింది. ఇప్పుడు తాజాగా 17 ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో కూడా భారత్-పాక్ మ్యాచ్ వివాదాస్పదంగా మారింది. కొలంబోలోని రేస్‌కోర్స్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన 17 ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లో భారత్ 3-2 స్కోరుతో పాకిస్తాన్‌పై విజయం సాధించింది. ఈ మ్యాచ్ రెండు జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధించిన తర్వాత జరిగినప్పటికీ, ఆటలో మాత్రం ఉత్కంఠ తగ్గలేదు. మ్యాచ్‌లో భారత్ తరఫున డల్లల్‌మున్ గంగ్టే 31వ నిమిషంలో గోల్ కొట్టి ఆధిక్యం సాధించాడు. దానికి సమాధానంగా, పాకిస్తాన్ ఆటగాడు ముహమ్మద్ అబ్దుల్లా 43వ నిమిషంలో పెనాల్టీ ద్వారా గోల్ చేసి స్కోరును సమం చేశాడు. అదే సమయంలో అబ్దుల్లా గోల్ సెలబ్రేషన్ వివాదానికి కారణమైంది. అతను కార్నర్‌కు వెళ్లి, తన సహచరులతో కలిసి కూర్చుని టీ తాగుతున్నట్టు సెలబ్రేట్ చేసుకున్నాడు. ఈ సెలబ్రేషన్ అందరి దృష్టిని ఆకర్షించింది. భారత ఆటగాళ్లు దీన్ని సీరియస్‌గా తీసుకుని, మరింత ఉత్సాహంతో ఆడారు. డానీ సింగ్ వాంగ్‌ఖెమ్ వింగ్‌లో దూసుకెళ్లి, పాక్ డిఫెండర్‌ను దాటి కచ్చితమైన పాస్ ఇచ్చాడు. ఆ బంతిని గంగ్టే అద్భుతంగా గోల్‌గా మలిచి, భారత్‌కు మళ్లీ ఆధిక్యాన్ని అందించాడు. దీంతో భారత్ 3-2 స్కోరుతో విజయం సాధించి, పాకిస్తాన్‌కు చుక్కలు చూపించింది. దీనికి ముందు ఆసియా కప్ 2025లో భారత్-పాకిస్తాన్ మధ్య గ్రూప్ స్టేజ్, ఆదివారం దుబాయ్‌లో జరిగిన సూపర్ ఫోర్ మ్యాచ్‌లు కూడా ఉత్కంఠ రేపాయి. పాకిస్తాన్ క్రికెటర్లు హారిస్ రౌఫ్, సాహిబ్‌జాదా ఆటలో భాగంగా రెచ్చగొట్టే సంజ్ఞలు చేయడం, ఆ తర్వాత భారత ఆటగాళ్లు విజృంభించి ఆడటం కనిపించింది.

## పాక్ బౌలర్ల పరువు తీసిన అభిషేక్ శర్మ



మన గళం, దుబాయ్: పాకిస్థాన్ బౌలర్ల పరువు తీశాడు అభిషేక్ శర్మ. సోనీ లైవ్ ఛానల్‌లో వీరేంద్ర సెహ్వాగ్‌తో చాట్ చేస్తున్న సమయంలో అభిషేక్ శర్మ కొన్ని కామెంట్స్ చేశారు. ఆసియాకప్‌లో పాకిస్థాన్‌తో జరిగిన సూపర్ ఫోర్ మ్యాచ్‌లో అభిషేక్ శరవేగంగా 74 రన్స్ చేసిన విషయం తెలిసిందే. ఆ మ్యాచ్‌లో హారీశ్ రౌఫ్, షాహీన్ షా అఫ్రిది లాంటి బౌలర్లను అభిషేక్ చితక్కొట్టాడు. ఎటువంటి తడబాటు లేకుండానే ఆ బౌలర్లను కొట్టేశాడు అభిషేక్. అయితే స్పోనీ స్పోర్ట్స్ చాటింగ్‌లో అతను ఆసక్తికరమైన కామెంట్ చేశారు. వీరేంద్ర సెహ్వాగ్ లాంటి బ్యాటర్ ఎదుర్కొన్న బౌలర్లు ప్రస్తుతం పాకిస్థాన్ జట్టులో లేరని అభిషేక్ అన్నాడు. అందుకే పాక్ బౌలర్లు తన దూకుడును అడ్డుకోలేకపోయినట్లు చెప్పాడు. పాకిస్థాన్ జట్టులో గతంలో ఉన్నట్లు ఉత్తమ బౌలర్లు లేరని, వీరేంద్ర సెహ్వాగ్ ఎదుర్కొన్న లాంటి బౌలర్లు ఇప్పుడు లేరని అభిషేక్ పేర్కొన్నాడు. వీరూ కొట్టినటువంటి బౌలర్లు ఇప్పుడు తనకేమీ కనిపించడం లేదన్నాడు. ఆ ఛాటింగ్ సమయంలో వీరేంద్ర సెహ్వాగ్ ఓ సూచన చేశాడు. 50, 70 రన్స్ చేసిన సమయంలో.. ఆ స్కోర్లను సెంచరీలుగా మార్చుకోవాలని అభిషేక్‌కు సలహా ఇచ్చాడు. భవిష్యత్తులో ఏదో సందర్భంలో సెంచరీ చేయలేకపోయామే అన్న బాధ కలుగుతుందని సెహ్వాగ్ అన్నాడు. 70 స్కోర్ చేసినప్పుడు, 100 మిస్ కావొద్దు అని సునీల్ గవాస్కర్ చెప్పాడని వీరూ గుర్తు చేశాడు. రిటైర్ అయిన తర్వాత 70, 80 రన్స్ స్కోరు చేసిన ఇన్నింగ్స్ గుర్తు వస్తుంటాయని, ఒకవేళ ఆ ఇన్నింగ్స్‌లను సెంచరీగా మలిస్తే కెరీర్ అద్భుతంగా ఉంటుందని, ఎందుకంటే అవకాశాలు మళ్లీ మళ్లీ రావు అని సెహ్వాగ్ అన్నాడు. బాగా ఆడుతున్న రోజు, నాటౌట్‌గా ఉండేందుకు ప్రయత్నించాలని, అదే ఉత్తమం అని అభిషేక్‌తో సెహ్వాగ్ చెప్పాడు.

## అలా అయితేనే పాకిస్థాన్ జట్టు గెలవగలదు.. ఇమ్రాన్ ఖాన్ సంచలన వ్యాఖ్యలు.



మన గళం, ఆసియా కప్‌లో వరుసగా రెండు సార్లు టీమిండియా చేతిలో ఓడిపోయిన పాకిస్థాన్ జట్టుపై ఇంటా బయటా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి . ఆ జట్టు అభిమానులు, మాజీ ఆటగాళ్లు కోపంతో మండిపోతున్నారు. పాక్ ఓటములపై పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ కూడా స్పందించారు. పాకిస్థాన్ గెలవాలంటే ఏం చేయాలో చెబుతూ వ్యంగ్యంగా కామెంట్స్ చేశారు. ఈ విషయాన్ని ఇమ్రాన్ ఖాన్ సోదరి అలీమా ఖాన్ సోమవారం వెల్లడించారు. 'ఆసియా కప్‌లో భారత్ చేతిలో పాకిస్థాన్ వరుసగా రెండు సార్లు ఓడిపోవడం గురించి నా సోదరుడికి చెప్పాను. భారత్‌పై పాకిస్థాన్ గెలవాలంటే.. పీసీబీ ఛైర్మన్ నఖ్వీ, ఆర్మీ ఛీఫ్ ఆసిఫ్ మునీర్ ఓపెనర్లుగా బరిలోకి దిగి, అంపైర్లనందరినీ మనవాళ్లను పెట్టుకోవాలని ఇమ్రాన్ అన్నారు. అసమర్థత, బంధుప్రీతితో పాకిస్థాన్ క్రికెట్‌ను నఖ్వీ నాశనం చేశాడని ఇమ్రాన్ బాధపడ్డారు. పాక్ ఆడుతున్న తీరు చూస్తే చాలా అవమానకరంగా ఉంది' అని అలీమా ఖాన్ సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు . పాకిస్థాన్ ప్రధానిగా ఉన్న సమయంలో ఇమ్రాన్ ఖాన్ అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటూ ప్రస్తుతం జైలులో ఉన్నారు. 2023 ఆగస్ట్ నెలలో ఇమ్రాన్ ఖాన్‌ను అరెస్ట్ చేశారు. అప్పట్నుంచి జైలులో ఉంటున్న ఇమ్రాన్ ఖాన్ బెయిల్ కోసం ఎన్నోసార్లు ప్రయత్నాలు చేశారు. అయితే ఆయన చేసిన ప్రయత్నాలు మాత్రం సఫలం కాలేదు.



## భారత పర్యటనకు బోల్ట్

మన గళం, ముంబై: జమైకన్ చిరుత ఉసేన్ బోల్ట్ భారత పర్యటనకు రానున్నాడు. వచ్చేనెల 1న అతడు ముంబైలో జరిగే ఒక ఫుట్‌బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్‌కు హాజరుకానున్నాడు. పూమా నిర్వహిస్తున్న ఈ ఈవెంట్‌లో బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ), ముంబై సిటీ ఎఫ్‌సీ మధ్య జరుగబోయే మ్యాచ్‌కు బోల్ట్ హాజరవుతాడు.

## కొరియా ఓపెన్ బరిలో ప్రణయ్

మన గళం, సువాన్ (కొరియా): నిలకడలేమి ఆట తీరుతో కొద్దికాలంగా ఇబ్బంది పడుతున్న భారత స్టార్ షట్లర్ హెచ్‌ఎస ప్రణయ్ కొరియా ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు సిద్ధమవుతున్నాడు. మంగళవారం నుంచి మొదలయ్యే ఈ టోర్నీ సింగిల్స్‌లో ప్రణయ్‌తో పాటు యువ షట్లర్ ఆయుష్ శెట్టి, కిరణ్ జార్జ్ కూడా పోటీ పడనున్నారు. భారత స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ ద్వయం ఈ టోర్నీ బరిలో లేకపోవడంతో ప్రణయ్, ఆయుషపైనే పతక అంచనాలు నెలకొన్నాయి. మహిళల సింగిల్స్‌లో అనుపమ ఉపాధ్యాయ, మిక్స్‌డ్ డబుల్స్‌లో మోహిత్, లక్షిత భారత్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

## వాలీబాల్ లీగ్‌లో కేఎల్ రాహుల్



మన గళం, పనాజీ: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్)లో భారత క్రికెటర్ కేఎల్ రాహుల్ భాగం కానున్నాడు. గోవా గార్డియన్స్ జట్టులో అతడు సహ యజమానిగా చేరాడు. హైదరాబాద్ వేదికగా అక్టోబర్ 2 నుంచి 26 దాకా జరుగబోయే పీవీఎల్ నాలుగో సీజన్‌లో గోవా జట్టు అరంగేట్రం చేయనుంది. కేఎల్ రాహుల్ కో ఓనర్ కాగా రాజు చేకూరి గోవా జట్టుకు వ్యవస్థాపకుడిగానే గాక యజమానిగానూ ఉన్నాడు.

# దీనస్థితికి ఎల్బీ స్టేడియం బురదమయంగా మారిన వైనం

మన గళం, హైదరాబాద్, : చారిత్రక ఎల్బీ స్టేడియం మరోసారి వార్తల్లోకెక్కింది! క్రీడలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఏపాటిదో మరోమారు తేటతెల్లమైంది. వార్షిక బడ్జెట్‌లో గతంలో ఎన్నడూలేని విధంగా నిధులు కేటాయించామంటూ బడాయికి పోయిన రాష్ట్ర ప్రభుత్వం..స్టేడియాలను నాన్‌స్పోర్ట్స్ ఈవెంట్లకు అద్దె ఇస్తూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నది. ఓవైపు స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ హబ్, 2036 ఒలింపిక్స్ ఆతిథ్యమంటూ నానా హంగామా చేస్తున్న కాంగ్రెస్ సర్కార్ ఉన్న స్టేడియాలను నాశనం చేస్తున్నది. నగరం నడిబొడ్డున ఉన్న ఎల్బీ స్టేడియంలో ప్రభుత్వం మారిన తర్వాత కమర్షియల్ ఈవెంట్లకు అడ్డాగా మారిపోయింది. మ్యూజికల్ నైట్, ఫోక్‌నైట్, సినిమా ప్రిరిలీజ్ ఈవెంట్లకు స్టేడియం చిరునామాగా మారింది. ఆదివారం ఇదే స్టేడియంలో టాలీవుడ్ ప్రముఖ నటుడు పవన్ కల్యాణ్ నటించిన 'ఓజీ' సినిమా కన్సర్ట్ జరిగింది. ఎడతెరిపిలేని వర్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రేక్షకులు వచ్చారు. తమ అభిమాన నటుని కొత్త సినిమా కోసం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కన్సర్ట్ జరుగుతున్నంత సేపు అలాగే ఉండిపోయారు. ఇంత వరకు బాగానే ఉంది. కన్సర్ట్ ముగిసిన తర్వాత ఎల్బీ స్టేడియం పరిస్థితి చూస్తే 'క్యా హాలత్ హెూ గయా' అంటూ పలువురు క్రీడాభిమానులు ముక్కున వేలేసుకుంటున్నారు. క్రీడాటోర్నీలకు ఆతిథ్యమివ్వాల్సిన చారిత్రక స్టేడియం బురద పొలంగా మారిన తీరును చూసి మనోవేదనకు గురవుతున్నారు. ఎంతో మంది దిగ్గజాలను అందించిన ఘనమైన చరిత్ర కల్గిన స్టేడియం ఇలా అయిపోయిందా అంటూ నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు. కొత్త స్టేడియాలు కట్టడం మాట అటుంచుతే..కనీసం ఉన్న వాటిని కాపాడుకునే తెలివి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదా అంటూ ప్రశ్నిస్తున్నారు. నాన్‌స్పోర్ట్స్ ఈవెంట్స్ కూడా ఇవ్వచ్చని, అది జీవోలోనూ స్పష్టంగా ఉందంటూ పేర్కొంటున్న సాట్స్ ఎండీ ప్రస్తుత స్టేడియం దీనస్థితికి కారణమేంటో చెప్పాలని క్రీడాభిమానులు నిలదీస్తున్నారు. ఇదిలా ఉంటే ఆదివారం జరిగిన కన్సర్ట్‌కు సదరు సినీ నిర్మాణ సంస్థ రూ.10 లక్షలు చెల్లించినట్లు తెలిసింది. ఇలా అద్దెకు ఇవ్వడం ద్వారా వస్తున్న ఆదాయాన్ని సాట్స్..తాత్కాలిక ఉద్యోగుల జీతాలకు, స్టేడియం నిర్వహణకు ఉపయోగిస్తున్నట్లు అధికారులు చెప్పుకొస్తున్నారు. మరి కమర్షియల్ ఈవెంట్లకు ఇస్తూ ఇంకా ఎన్ని రోజులు స్టేడియాన్ని నాశనం చేస్తారంటూ క్రీడాభిమానులు ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వ పెద్దలు స్టేడియం పరిస్థితిపై ఆలోచించాలని మనవి చేస్తున్నారు.



Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310